ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5



అనంతపురం

జిల్లా వార్తలు

శనివారం 10 ఫిబ్రవరి 2024



నీరులేక వాడుపట్టిన చీనీచెట్లు

బతికేలా లేవు

నీరు లేక ఎండుతున్న చీనీ తోటలు

కొత్తగా తవ్వించినా.. కరుణించని గంగమ్మ

ముకుందాపురం చెరువుకు నీరివ్వని పాలకులు

ఎమ్మెల్యే, ఆమె భర్త నిర్లక్ష్యంపై రైతుల మండిపాటు

గార్లదిన్నె మండలంలో అడుగంటిన భూగర్భ జలాలు

చీనీ సాగు అనగానే జిల్లాలో గుర్తొచ్చే ఊరు ముకుందాపురం. గార్లదిన్నె మండలంలోని ఈ గ్రామంలో సుమారు 550 కుటుంబాలు ఉన్నాయి. తొంభై శాతం మంది రైతులే. గ్రామం చుట్టుపక్కల ఎక్కడ చూసినా చీనీ తోటలే కనిపిస్తాయి. అలాంటి ఊరును ఇప్పుడు నీటి కష్టం వణికిస్తోంది. తీవ్ర వర్షాభావం కారణంగా భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. బోరు బావుల్లో నీరు ఇంకిపోతోంది. పండ్ల తోటలు కళ్లెదుటే ఎండిపోతున్నాయి. వాటిని కాపాడుకునేందుకు సుమారు 800 అడుగుల లోతు వరకూ కొత్తగా బోర్లు వేయిస్తున్నారు. అయినా నీటి తడి కనిపించడం లేదు. ఈ సమస్యకు ప్రకృతి విపత్తు మాత్రమే కారణం కాదు. పాలకులు, అధికారుల నిర్లక్ష్యం కూడా కారణమేనని ఆ ఊరి రైతులు మండిపడుతున్నారు. ఈ సమస్యను ముందుగానే పసిగట్టి.. చెరువుకు నీరు వదలాలని స్థానిక ఎమ్మెల్యే పద్మావతి, ఆమె భర్త, ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డికి విన్నవించామని, పెడచెవిన పెట్టి తమకు ద్రోహం చేశారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. - గార్లదిన్నె

ఆత్మహత్యలే శరణ్యం..

చీనీ చెట్లనే నమ్ముకుని జీవనం సాగిస్తున్నాం. ఐదేళ్ల క్రితం గ్రామంలో నీటి కష్టాలు వచ్చాయి. చెట్లను కాపాడుకునేందుకు రూ.లక్షలు ఖర్చు చేసినా ఫలితం లేకపోయింది. అప్పులు మిగిలాయి తప్ప చెట్లు బతకలేదు. ఇప్పుడు అప్పులు చేసి చెట్లను పెంచుకున్నాం. ఇంతలోనే నీటి కష్టాలు మొదలయ్యాయి. రూ.2 లక్షలు ఖర్చు చేసి సుమారు 800 అడుగుల వరకు రెండు బోర్లు వేసినా చుక్కనీరు పడలేదు. చెట్లను కాపాడుకనేందుకు ట్యాంకర్ల ద్వారా నీటిని సంపులోకి తోలుకుంటున్నాం. ఇప్పటి వరకు 50 ట్యాంకర్లు నీరు తోలుకున్నాం. ఈసారి చెట్లు ఎండిపోతే రైతులకు ఆత్మహత్యలే శరణ్యం. - గోపాల్, రైతు, ముకుందాపురం





తోటలోని గుంతలో ట్యాంకర్ నీటి నిల్వ

గార్లదిన్నె, ముకుందాపురం, యర్రగుంట్ల, సంజీవపురం, పెనకచెర్ల, మర్తాడు, బూదేడు తదితర గ్రామాల్లో వేలాది ఎకరాల్లో రైతులు పండ్ల తోటలను సాగుచేశారు. ఇందులో చీనీదే సింహ భాగం. ఒక్క ముకుందాపురం గ్రామంలోనే సుమారు మూడు వేల ఎకరాల దాకా చీనీ తోటలు ఉన్నట్లు అంచనా. గ్రామ సమీపంలో ఉన్న చెరువుకు పీఏబీఆర్ కుడి కాలువ ద్వారా నీరు సరఫరా చేసేవారు. చెరువు నిండుగా ఉంటే భూగర్భ జలాలు పుష్కలంగా ఉండేవి. కానీ ఈ ఏడాది కుడి కాలువకు నీరు విడుదల చేయలేదు.

వేలాది ఎకరాల్లో చీనీ

చెరువును నింపాలని ముకుందాపురం రైతులు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆమె భర్త సాంబశివారెడ్డికి ఎన్నోసార్లు కలిసి విన్నవించారు. ఫలితం శూన్యం. చెరువుకు నీరందక భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. బోరుబావుల్లో చుక్క నీరు రావడంలేదు. రూ.లక్షలు ఖర్చు చేసి సాగు చేసిన పండ్లతోటలు కళ్లెదుటే ఎండిపోతుంటే రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.



కొత్త బోర్లు వేసినా..

పండ్ల చెట్లను ఎలాగైనా కాపాడుకోవాలని రైతులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. నీటి కోసం 800 అడుగుల లోతుకు పైగానే బోర్లు వేయిస్తున్నారు. కానీ పాతాళగంగ ఆచూకీ లభించడం లేదు. ఆశ చావక తోటల్లో బోర్లు మీద బోర్లు వేయించారు. ఎక్కడ చూసినా ఆ గోతులే కనిపిస్తున్నాయి. కొందరు రైతులు ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించి చెట్లకు పోస్తున్నారు. మరికొందరు చేత కాక వదిలేసుకుంటున్నారు. ఇదే సమస్య ఐదేళ్ల క్రితం వచ్చింది. అప్పట్లో రూ.లక్షలు వెచ్చించి నీటిని కొనితెచ్చి పోశారు. అయినా మండే ఎండలకు అవి చాలలేదు. తోటలు నిలువునా ఎండిపోయాయి. చెట్లు పోయి, డబ్బులు పోయి తీవ్రంగా నష్టపోయారు. మళ్లీ అలాంటి సమస్యే రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పరిస్థితి ఇంత తీవ్రంగా ఉన్నా.. అధికారులు, ప్రజాప్రతినిధులు తమ ఊళ్ల వైపు కన్నెత్తి చూసిన పాపన పోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి..



నాకు 750 చీనీ చెట్లు ఉన్నాయి. రూ.5 లక్షలు ఖర్చు చేసి 9 బోర్లు వేయించాను. ఒక్క బోరులో నీరు పడింది. ఆ నీరు చెట్లకు సరిపోవడం లేదు. దీంతో రూ.80 వేలు ఖర్చు చేసి నీటి కుంట ఏర్పాటు చేసుకున్నారు. బోరు నీరు, ట్యాంకర్ నీరు నిల్వచేసుకుని పై మోటర్ ద్వారా చెట్లకు సరఫరా చేసుకుంటున్నాం. చెట్లను కాపాడుకునేందుకు మేము పడుతున్న కష్టాలు అన్నీ ఇన్ని కావు. గతంలో ఇలాంటి పరిస్థితి రావడంతో గ్రామంలో రైతులందరం నష్టపోయాం. ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా అందలేదు. ఈసారైనా పాలకులు, అధికారులు స్పందించి మమ్మల్ని ఆదుకోవాలి. - కృష్ణంరాజు, రైతు, ముకుందాపురం

ఎవరూ పట్టించుకోవడం లేదు..

పండ్లతోటలకు నీరు అందడంలేదు. ఇది ముమ్మాటికీ పాలకులు, అధికారుల నిర్లక్ష్యమే. పాలకులు పట్టించుకోరు.. అధికారులు కనికరించడం లేదు. ముందస్తుగా చర్యలు తీసుకుని చెరువులకు నీరందించాల్సిన అధికారులు మిన్నకుండిపోయారు. ఎమ్మెల్యే, ఆమె భర్తను కలిశాం. అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. ఏమాత్రం పట్టించుకోలేదు. చెరువు నింపి ఉంటే ఈ రోజుల నీటి కష్టాలు వచ్చేవి కావు. సాంబశివారెడ్డికి రైతుల సమస్యలు పట్టలేదు. ధానార్జనే ధ్యేయంగా వ్యవహరించారు. గతంలో ఇలాంటి పరిస్థితి వచ్చినప్పుడు చెట్లను కాపాడుకునేందుకు రక్షక తడుల కోసం ట్యాంకర్ల ద్వారా నీరు తోలుకున్నాం. ప్రభుత్వం నుంచి రూపాయి అందలేదు. గ్రామానికి రూ.2 కోట్లకు పైగా రావాల్సి ఉంది. - హనుమంతురెడ్డి, ముకుందాపురం



ఎందుకో తొందర..!

ఓట్ల కోసమేనా..?



జగనన్న కాలనీల్లోని ఇళ్లకు రిజిస్ట్రేషన్

ఇతర రిజిస్ట్రేషన్లకు శుక్రవారం బ్రేక్

శని, ఆదివారాల్లోనూ పనిచేయాలని ఆదేశాలు

సచివాలయాలకు వెళ్లి పనిచేస్తున్న రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 9: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండటంతో అధికార పార్టీ ఓట్ల కోసం పాట్లు పడుతోంది. జగనన్న కాలనీల్లో నిర్మించిన ఇళ్లకు రిజిస్ట్రేషన్ చేయించాలంటూ ప్రభుత్వం ఆదేశించింది. ఇతర రిజిస్ట్రేషన్ వ్యవహారాలను శుక్రవారం పూర్తిగా పక్కన పెట్టి జగనన్న కాలనీల్లోని ఇళ్లను మాత్రమే రిజిస్ట్రేషన్ చేయాలని రిజిస్ట్రేషన్ శాఖ, జిల్లా స్థాయి ఉన్నతాధికారులను ఆదేశించింది. జిల్లాలోని అన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు, సిబ్బంది రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టకపోవడంతో క్రయ, విక్రయదారులు ఇబ్బందులు పడ్డారు. రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు, సిబ్బంది సంబంధిత సచివాలయాలకు వెళ్లి జగనన్న కాలనీల్లోని ఇళ్లకు రిజిస్ట్రేషన్ చేయించాల్సి వచ్చింది.



నగరంలోని 4వ సచివాలయంలో ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టిన సిబ్బంది

రిజిస్ట్రేషన్లకు బ్రేక్...

జిల్లాలోని అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ రిజిస్ట్రేషన్ ప్రక్రియకు బ్రేక్ పడింది. అనంతపురంలోని రాంనగర్ కార్యాలయం, రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, శింగనమల, గుంతకల్లు, గుత్తి, కళ్యాణదుర్గం, ఉరవకొండ, కణేకల్లు, పామిడి, యాడికి, రాయదుర్గం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ రిజిస్ట్రేషన్ చేపట్టలేదు. దీంతో శుక్రవారం ఒక్క రోజే జిల్లా వ్యాప్తంగా 150 నుంచి 200వరకు డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్‌కు బ్రేక్ పడినట్లయింది. అన్ని సబ్‌రిజిస్ట్రార్ల కార్యాలయ పరిధిలో జగనన్న ఇళ్లకు రిజిస్ట్రేషన్ చేయడానికే ప్రాధాన్యం ఇచ్చారు. అనంతపురం పరిధిలో ఉప్పరపల్లి, కందుకూరు, బుక్కరాయసముద్రం సచివాలయాల పరిధిలో సంబంధిత లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్లు చేశారు.

అధికారులకు తలనొప్పులు...

ఇప్పటికే రిజిస్ట్రేషన్ శాఖలో అమలైన కొత్త విధానం 2.0తో ఆ శాఖాధికారులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పుడు జగనన్న కాలనీల్లోని ఇళ్లకు రిజిస్ట్రేషన్ వ్యవహారంతో తల బొప్పికట్టినట్లయింది. రిజిస్ట్రేషన్ చేయడానికి సచివాలయాల సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇవ్వడం, వారి అనుమానాలు నివృత్తి చేయడంలోనూ బిజీగా ఉండిపోయారు. రెగ్యులర్‌గా చేయాల్సిన రిజిస్ట్రేషన్లతో ఒత్తిడిలో ఉన్న అధికారులు, సిబ్బందికి జగనన్న ఇళ్లతో మరింత ఒత్తిడి కలిగినట్లయింది. గత కొన్ని రోజులుగా మనశ్శాంతి కరువైందంటూ ఆ శాఖాధికారులు, సిబ్బంది వాపోతున్నారు. వార్డు అడ్మిన్‌లకు సబ్‌రిజిస్ట్రార్ హోదా సైతం ఇచ్చేశారు. కానీ సచివాలయ సిబ్బందికి పదే పదే అనుమానాలు నివృత్తి చేయడానికే తమ సమయం సరిపోతోందని రిజిస్ట్రేషన్ శాఖ వర్గాలు వాపోతున్నాయి.

శని, ఆదివారాల్లోనూ పనిచేయాలని ఆదేశాలు

ఎన్నికలు వచ్చేలోగా ఎట్టి పరిస్థితుల్లోనూ జగనన్న పేదల ఇళ్లకు రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే పలుమార్లు రిజిస్ట్రేషన్ అధికారుల సహాయంతో ఆ ప్రక్రియ కొంతవరకు చేశారు. శుక్రవారం పూర్తిగా జగనన్న ఇళ్లపైనే దృష్టి సారించాలని ఆదేశాలందాయి. దీంతో పాటు రెండో శనివారం, ఆదివారం సెలవు రోజులున్నప్పటికీ ఈ రెండ్రోజులు పనిచేసి ఆ ఇళ్లకు రిజిస్ట్రేషన్ చేయాలని ఆదేశాలిచ్చారట.

రాష్ట్ర భవిష్యత్తు కోసం తొలి ఓటు టీడీపీకే వేయండి

మాజీ మంత్రి పరిటాల సునీత



రాప్తాడు నియోజకవర్గం కొత్త ఓటర్లతో మాజీ మంత్రి పరిటాల సునీత

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 9: కొత్తగా ఓటు హక్కు పొందిన యువత రాబోవు ఎన్నికల్లో రాష్ట్ర భవిష్యత్తు కోసం ఓటు వేయాలని మాజీ మంత్రి పరిటాల సునీత విజ్ఞప్తి చేశారు. అనంతపురం నగరంలోని తన క్యాంపు కార్యాలయంలో కొత్తగా ఓటు హక్కు పొందిన విద్యార్థులతో శుక్రవారం ఆమె ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. 'మీరు ఓటు హక్కును వినియోగించుకోవడం ఎంత ముఖ్యమో.. ఆ ఓటు రాష్ట్ర భవిష్యత్తుకు ఉపయోగపడేలా చూసుకోవడం అంతే ముఖ్యం' అని అన్నారు. 'ఈ ఐదేళ్లలో రాష్ట్రంలో ఎలాంటి సమస్యలు తలెత్తాయో మీరందరూ చూశారు. మరోసారి వైసీపీ అధికారంలోకి వస్తే ఇంతకంటే దారుణమైన పరిస్థితులను చూస్తారు. ఈ ఐదేళ్లల్లో జిల్లాకు ఒక్క పరిశ్రమైనా వచ్చిందా..? ఒక్కరికైనా ఉద్యోగాలు కల్పించారా? ఆలోచించండి' అని కొత్త ఓటర్లకు ఆమె సూచించారు. వేలాది మంది యువతీ యువకులు ఉద్యోగాల కోసం పక్క రాష్ట్రాలకు వెళుతున్నారని, చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జిల్లాకు కియ పరిశ్రమను తీసుకొచ్చారని గుర్తు చేశారు. తద్వారా వేలాది మందికి ఉద్యోగాలు వచ్చాయని అన్నారు. కియకు అనుబంధంగా ఎన్నో కంపెనీలు వచ్చాయని, ఇంకా కొన్ని పరిశ్రమలు వచ్చేవని అన్నారు. వైసీపీ నాయకుల దౌర్జన్యాలకు భయపడి పక్క రాష్ట్రాలకు తరలిపోతున్నాయని అన్నారు. చంద్రబాబుతోనే రాష్ట్రానికి మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. టీడీపీ మినీ మేనిఫెస్టోలో యువతకు నిరుద్యోగ భృతి, ఉద్యోగాల కల్పనపై స్పష్టమైన హామీ ఇచ్చారని అన్నారు. ఈ విషయాన్ని యువత ఆలోచించి, వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేయాలని ఆమె కోరారు.

ఎవరు..? ఎందుకొచ్చారు..?





మాన్యం భూమిలో తోలిన రాళ్లు



సర్వే నంబర్ 1447కు సంబంధించిన అడంగల్ (ఆన్‌లైన్)

యాడికి మండలం తిరుణాంపల్లి గ్రామ సమీపాన ఉన్న రూ.కోట్ల విలువగల దేవుని మాన్యం కబ్జాకు గురౌతోందన్న ప్రచారం జరుగుతోంది. ఆ భూమిలో గుర్తు తెలియని వ్యక్తులు నిర్మాణ పనులను ప్రారంభించి, వదిలిపెట్టి వెళ్లారు. సర్వే నంబర్ 1447లో 11.2 సెంట్ల దేవుని మాన్యం ఉంది. యాడికి-బుగ్గరోడ్డుకు అతి సమీపంలో ఉండడంతో ఈ భూమిని కబ్జా చేయాలని కొందరు ప్రయత్నిస్తున్నారు. ఇక్కడ ఎకరం రూ.50 లక్షలకు పైగా ధర పలుకుతోంది. చిన్నపాటి నిర్మాణం కోసం ఈ భూమిలో కొందరు రాళ్లు తోలడంతో స్థానికులు అనుమానిస్తున్నారు. ఈ విషయమై దేవదాయశాఖ ఇన్‌చార్జి ఈఓ దుర్గాప్రసాద్‌ను వివరణ కోరడానికి ఫోన్‌లో ప్రయత్నించగా, అందుబాటులోకి రాలేదు. - యాడికి

అక్రమాలకు రిజిస్ట్రేషన్!

ఉద్దేహాళ్ జగనన్న కాలనీలో చెదిరిపోయిన హద్దులు



జగనన్న కాలనీలో ఒకరికి ఇచ్చిన పట్టాపై మరొకరికి రిజిస్ట్రేషన్

అధికారులపై అధికారపార్టీ నాయకుల ఒత్తిడి

లబ్ధిదారుల జాబితా బయటపెట్టాలి: టీడీపీ

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 9: మండలంలోని జగనన్న కాలనీల్లో ఇంటిపట్టాల రిజిస్ట్రేషన్‌ల వ్యవహారంలో అక్రమాలకు తెరలేచింది. మండలంలో 1625మందికి పట్టాలు ఇచ్చేందుకు మూడేళ్ల కిందట లేఅవుట్‌లు వేశారు. అలాగే ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి సమక్షంలో ఒక్కో గ్రామానికి చెందిన ఐదుగురికి పట్టాలిచ్చి వెనక్కి తీసుకున్నారు. పట్టాలు సరిగాలేవని తప్పు ఒప్పులు సరిచేసి వలంటర్ ద్వారా ఇళ్ల వద్దకే వచ్చి పట్టాలిస్తామని చెప్పి చేతులు దులుపుకున్నారు. కొన్ని కాలనీలో హద్దులు ఏర్పాటు చేసి రాళ్లు వేశారు. రోడ్డుకు మట్టితోలారు. వర్షాలకు కాలనీలో నీళ్లు నిలబడి అవన్నీ చెదిరిపోయాయి. ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో పేదలకు జగనన్నకాలనీలో ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్‌ల కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గత వారంరోజుల నుంచి రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శుల సమక్షంలో సచివాలయాల్లో కార్యక్రమం జరుగుతోంది. అయితే గ్రామాలలో లబ్ధిదారులకు తమ స్థలాలు ఎక్కడ ఉన్నాయో తెలియదు. ఈ నేపథ్యంలో కొందరు రెవెన్యూ అధికారులు అక్రమాలకు తెరలేపారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండలంలోని ఉద్దేహాళ్, బొమ్మనహాళ్, బండూరు, దేవగిరి తదితర గ్రామాలలో ఇంటిపట్టాల రిజిస్ట్రేషన్ కోసం అక్రమాలకు తెరలేపినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అధికార పార్టీకి చెందిన కొందరి నాయకుల ఒత్తిళ్ల మేరకు అధికారులు అప్పట్లో ఇచ్చిన లబ్ధిదారులకు కాకుండా వేరేవారికి పట్టాలు మార్చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే కొంతమంది పంచాయతీ కార్యదర్శులు ఇందుకు ఒప్పుకోవడం లేదని తెలిసింది. ఒత్తిడి తీవ్రంగా పెంచడంతో ఒక పంచాయతీ కార్యదర్శి అందుబాటులో లేకుండాపోయినట్లు సమాచారం. ఉద్దేహాళ్ కాలనీలో లబ్ధిదారుల జాబితాను బయటపెట్టాలని ఇంటిస్థలాలు ఎక్కడున్నాయో చూపించాలని స్థానిక టీడీపీ నాయకులు నవీన్, సంగప్ప డిమాండ్ చేశారు. ఇంటిస్థలాలు హద్దులు చూపించి లబ్ధిదారుల జాబితాను ప్రదర్శించి రిజిస్ట్రేషన్‌లు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై తహసీల్దార్ రామాంజినమ్మను ప్రశ్నించగా లబ్ధిదారుల జాబితా బయట పెట్టేందుకు ససేమిరా అన్నారు.



బొమ్మనహాళ్ రెవెన్యూ కార్యాలయంలో జరుగుతున్న రిజిస్ట్రేషన్లు

భార్యాబిడ్డల హత్య

యాడికిలో దారుణ ఘటన

నిందితుడి కోసం పోలీసుల గాలింపు





విగత జీవులుగా పడిఉన్న తల్లి, కుమార్తె, బడికి వెళ్లడంతో ప్రాణాలతో బయటపడ్డ శాన్విత

యాడికి, ఫిబ్రవరి 9: మండల కేంద్రంలోని చౌడేశ్వరి కాలనీలో కట్టుకున్న భార్య, కన్న కూతురును ఓ వ్యక్తి దారుణంగా హతమార్చాడు. ఒక రోజు తరువాత వ్యవహారం వెలుగులోకి వచ్చింది. యాడికి పట్టణానికి చెందిన చంద్రావతి(25)ని పెద్దవడుగూరు మండలం కిష్టిపాడు గ్రామానికి చెందిన రామకృష్ణకు ఇచ్చి 2018లో వివాహం చేశారు. వీరికి కూతుళ్లు శాన్విత (4), చైత్రిక (9 నెలలు) ఉన్నారు. రామకృష్ణ దంపతులు చేనేత మగ్గం ద్వారా జీవనం సాగిస్తున్నారు. యాడికి చౌడేశ్వరికాలనీలో అద్దె ఇంట్లో ఉంటున్నారు. శాన్విత గురువారం బడికి వెళ్లింది. ఆ తరువాత భార్యను, చిన్న కూతురును రామకృష్ణ హత్య చేసి వెళ్లిపోయాడు. చంద్రావతి చేతులను కట్టేసి తలదిండుతో ఊపిరి ఆడకుండా చేశాడు. చైత్రిక గొంతు నులిమి, మీద బియ్యం ప్యాకెట్ పెట్టి వెళ్లిపోయాడు. తాము తాడిపత్రికి వైద్యం కోసం వెళుతున్నామని, బడికి వెళ్లిన శాన్వితను సాయంత్రం ఇంటికి తీసుకువెళ్లాలని చంద్రావతి తండ్రి సెల్‌ఫోన్‌కి గురువారం మధ్యాహ్నం మెసేజ్ పంపించాడు. ఆ తరువాత సెల్ స్విచాఫ్ చేసుకున్నాడు. ఇంటికి తాళం వేసి ఉండటం, ఫోన్ స్విచాఫ్ రావడంతో చంద్రావతి బంధువులు అనుమానించి, శుక్రవారం పోలీసులను సంప్రదించారు. వారి సూచన మేరకు తాళం పగులగొట్టి ఇంట్లోకి వెళ్లి చూశారు. అప్పుడుగానీ హత్యల గురించి బయట పడలేదు. తాడిపత్రి డీఎస్పీ గంగయ్య, యాడికి సీఐ నాగార్జునరెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించి, వివరాలు ఆరాతీశారు. చంద్రావతి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. రామకృష్ణ ఆన్‌లైన్ జూదం ఆడేవాడని, అనాథల అంత్యక్రియలు నిర్వహించేవాడని స్థానికులు అంటున్నారు. అందరితోనూ మంచిగానే ఉండేవాడని, హత్యలకు కారణం తెలియదని అంటున్నారు.

బడికి వెళ్లి బతికిపోయిన శాన్విత

భార్య, చిన్న కూతురును రామకృష్ణ హత్య చేసినట్లుగా పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. ఈ దారుణాన్ని చూసిన స్థానికులు తీవ్ర ఆవేదనకు లోనయ్యారు. ఆ సమయంలో పెద్ద కూతురు శాన్విత బడికి వెళ్లడంతో బతికిపోయిందని పలువురు వ్యాఖ్యానించారు. 'ఆ ఇంట్లో, ఆ సమయంలో ఏం జరిగిందో తెలియదు. భార్యతో గొడవ పడి, ఆవేశంలో చంపేసి ఉండొచ్చు. కానీ అభం శుభం తెలియని తొమ్మిది నెలల పసికందును ఎందుకు చంపినట్లు?' అని స్థానికులు చర్చించుకుంటున్నారు. శాన్విత స్థానికంగా ఉన్న ప్రైవేట్ పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతోంది. తన ఇంటివద్ద గుమిగూడిన జనాన్ని చూసి ఏం జరిగిందో తెలియక అమాయకంగా చూస్తున్న తనను చూసి పలువురు కంటతడి పెట్టుకున్నారు.



చిన్నారి చైత్రికతో చంద్రావతి, రామకృష్ణ

రామకృష్ణ ఎటు వెళ్లిపోయాడు?

భార్య, కుమార్తెను చంపిన రామకృష్ణ ఎటు వెళ్లాడనేది తేలాల్సి ఉంది. రామకృష్ణ సెల్ ఫోన్‌లో జూదం ఆడేవాడని స్థానికులు అంటున్నారు. యోగా చేసేవాడని, అనాథ శవాల అంత్యక్రియలు చేయడానికి వెళ్లేవాడని చెబుతున్నారు. కాలనీలో మంచివాడుగానే గుర్తింపు పొందాడు. అలాంటివాడు భార్య, కుమార్తెను అంత దారుణంగా ఎందుకు చంపాడో తెలియడం లేదని అంటున్నారు. పోలీసులకు నిందితుడు పట్టుబడితేగాని వాస్తవాలు వెలుగులోకి రావని అంటున్నారు. పోలీసులు రామకృష్ణ కోసం గాలిస్తున్నారు. రామకృష్ణ గురువారం రాత్రి 10 గంటల సమయంలో హాస్పిటల్ కాలనీలో ఉన్న తన సోదరి ఇంటికి వెళ్లి.. అక్కడే నిద్రించాడు. తెల్లవారుజామున 5 గంటల సమయంలో నిద్రలేచి వెళ్లిపోయాడని తెలిసింది.

భూమి కోసం కిడ్నాప్

దళిత యువకుడిని ఎత్తుకుపోయిన వైసీపీ నాయకులు
బెదిరించి రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు పన్నాగం
డయల్ 100కి బంధువుల ఫిర్యాదు
కాపాడిన పోలీసులు..వివరాలు వెల్లడించేందుకు ససేమిరా


బత్తలపల్లి పోలీస్ స్టేషన్ వద్ద పెద్దప్పయ్య బంధువులు

ధర్మవరం, ఫిబ్రవరి 9: పట్టణంలో వైసీపీ నాయకులు బరితెగించారు. విలువైన భూమిని కాజేసేందుకు ఏకంగా ఓ యువకుడిని శుక్రవారం కిడ్నాప్ చేశారు. బలవంతంగా భూమి రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు తీసుకెళ్లగా.. పోలీసులు కాపాడారు. జిల్లాలోని బత్తలపల్లి మండలం గంటాపురం గ్రామానికి చెందిన అక్కిం లక్ష్మయ్యకు ఇద్దరు కుమారులు. ఇటీవల లక్ష్మయ్యతోపాటు చిన్న కుమారుడు సుబ్బరాయుడు మృతిచెందాడు. ఆ కుటుంబంలో పెద్దప్పయ్య మాత్రమే మిగిలాడు. ఆ కుటుంబం పేరిట బత్తలపల్లి సమీపాన జాతీయ రహదారి పక్కనే, టోల్ గేటుకు ఆనుకుని 1.05 ఎకరాల భూమి ఉంది. బహిరంగ మార్కెట్‌లో దీని విలువ రూ.5 కోట్ల వరకు పలుకుతోంది. ఆ కుటుంబంలో మిగిలిన పెద్దప్పయ్యకే ఈ భూమి దక్కుతుంది. ఒంటరిగా ఉంటున్న దళిత పెద్దప్పయ్య నిస్సహాయతను ఆసరాగా చేసుకున్న వైసీపీ నాయకులు, ఆ భూమిని కాజేసేందుకు కుట్ర పన్నారు. గంటాపురానికి చెందిన వైసీపీ ప్రజాప్రతినిధి, బత్తలపల్లి మండలానికి చెందిన మరో ఇద్దరు అధికార పార్టీ నాయకులు పథకం రచించారు. పెద్దప్పయ్య తండ్రి లక్ష్మయ్య ఆ భూమిని వారికి రాసిచ్చినట్లుగా పత్రాలు సృష్టించుకున్నట్టు తెలుస్తోంది. ఎలాగైనా పెద్దప్పయ్యను పట్టుకుని రిజిస్ట్రేషన్ చేయించుకుంటే భూమి సొంతమవుతుందని భావించారు. పెద్దప్పయ్య నాలుగేళ్లుగా బెంగళూరులో ఉంటూ ఫ్యాక్టరీల్లో పనులకు వెళ్తుండేవాడు. రెండు నెలల క్రితమే ధర్మవరం వచ్చి, ఇటుకల బట్టీలో పనికెళ్తున్నట్లు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న వైసీపీ నాయకులు, రిజిస్ట్రేషన్‌కు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. ధర్మవరంలో శుక్రవారం పెద్దప్పయ్యను కిడ్నాప్ చేశారు. ప్రత్యేక వాహనంలో నేరుగా ధర్మవరంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి తరలించారు. ఇంతలోనే విషయం బంధువులకు తెలియడంతో వారు డయల్ 100కి సమాచారం అందించారు. అప్రమత్తమైన పోలీసులు, అక్కడికి వెళ్లి పెద్దప్పయ్యను రక్షించారు. భూమి రిజిస్ట్రేషన్ కాకుండా అడ్డుకున్నట్లు తెలిసింది. కానీ పెద్దప్పయ్య ఎక్కడున్నారన్న విషయాన్ని పోలీసులు వెల్లడించట్లేదు. తమకేమీ తెలియదని దాట వేస్తున్నారు. దీన్నిబట్టి పోలీసులపై అధికార పార్టీ ఒత్తిడి ఏ మేరకు ఉందో అర్థం చేసుకోవచ్చు. పెద్దప్పయ్య బంధువులు అతనికోసం బత్తలపల్లి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి విచారించారు. వారికి బాధితుడిని అప్పగించారా, లేదా అన్నది బహిర్గతం కాలేదు. ఈ నేపథ్యంలో కిడ్నాపర్లపై కేసు నమోదు చేస్తారా, అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గి నీరుగారుస్తారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లావాసిపై ఎమ్మిగనూరులో హత్యాయత్నం

- ఆర్థిక లావాదేవీలే దాడికి కారణం


కుప్పకూలిపోయిన వీర నారాయణను పరిశీలిస్తున్న పోలీసులు

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 9: ఎమ్మిగనూరు పట్టణంలోని కోర్టు రోడ్డులో శుక్రవారం హత్యాయత్నం జరిగింది. అనంతపురం జిల్లా కనగానపల్లి మండలం దాదులూరు గ్రామానికి చెందిన బుట్ట వీర నారాయణపై సీ బెళగల్ మండలం కంబదహాల్(తూర్పు కంపాడు)గ్రామానికి చెందిన కురువ ఈరన్న కొడవలితో విచక్షణారహితంగా దాడిచేశాడు. వీరిద్దరి మధ్య ఆర్థిక లావాదేవీలు ఉన్నాయి. ఓ చెక్ బౌన్స్ కేసులో వీర నారాయణ కోర్టుకు హాజరైన క్రమంలో బయట చెట్టు కింద నిలబడి ఉన్నాడు. అప్పటికే కోర్టు బయట కాపు కాసిన ఈరన్న కొడవలితో వీర నారాయణపై దాడికి పాల్పడ్డాడు. తప్పించుకొని పరుగుతీసేందుకు ప్రయత్నించగా వెంటపడి వీరనారాయణను తలపైన, గొంతుపైన నరికాడు. దీంతో వీరనారాయణ కుప్పకూలిపోయాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని రక్తపు మడుగులో పడి ఉన్న వీర నారాయణను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కర్నూలు జీజీహెచ్‌కు తరలించారు. పట్టణ ఇన్‌చార్జి సీఐ మోహన్ రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పత్తికి బోనస్ ప్రకటించాలి

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 9: జిల్లాలో పత్తి క్వింటాకు రూ.2 వేలు బోనస్ ప్రకటించి, రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. గత ఖరీఫ్‌లో దాదాపు 80వేల ఎకరాల్లో పత్తి సాగు చేయగా వర్షాలు సకాలంలో రాకపోవడంతో రైతులు నష్టపోయారన్నారు. రెండేళ్ల క్రితం పత్తి ధర బాగా ఉండడంతో జిల్లాలో రైతులు అప్పులు చేసి మరీ పత్తి సాగు చేశారని, అయితే పత్తి దిగుబడి తగ్గడం, దీనికితోడు మద్దతుధర ఆశించినమేర లేకపోవడంతో రైతులు దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. దీంతో దళారులు సిండికేట్ అయ్యి రూ.5వేల నుంచి రూ.6వేల మధ్య మాత్రమే పత్తి కొనుగోలు చేస్తుండటంతో రైతులకు గిట్టుబాటుకావడం లేదన్నారు. ఈక్రమంలోనే అప్పుల భారం పెరిగి కొందరు రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి, రైతుల వద్ద ఉన్న మొత్తం పత్తిని ప్రస్తుతమున్న ధర క్వింటాకు రూ.7,020కు అదనంగా రూ.2వేలు బోనస్ ప్రకటించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

మూగజీవుల మృత్యుఘోష



- అక్రమంగా మూగజీవాల రవాణా
- రవాణాకు రాచబాట ఎన్‌హెచ్ 44
- తెలంగాణ నుంచి బెంగళూరుకు తరలింపు
- దాడులు మరచిన పోలీసులు, అధికారులు
- పలుచోట్ల పశువుల కంటైనర్లకు ప్రమాదాలు
- మృతువాత పడుతున్న మూగజీవులు

తాడిపత్రి, ఫిబ్రవరి 9: పశువుల అక్రమ రవాణాకు హైదరాబాదు-బెంగళూరు జాతీయ రహదారి(ఎన్‌హెచ్44) రాచబాటగా మారింది. అధికారులు తనిఖీలు చేయకపోవడం వల్ల యథేచ్ఛగా రవాణా జరుగుతోంది. ఈ క్రమంలో రోడ్డు ప్రమాదాలు జరిగి మూగజీవులు మృతువాత పడుతున్నాయి. పెద్దవడుగూరు మండలం కాశేపల్లి టోల్‌ప్లాజా సమీపంలో బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డుప్రమాదమే ఇందుకు తార్కాణం. తెలంగాణ నుంచి బెంగళూరుకు కంటైనర్‌లో తరలిస్తున్న పశువుల్లో 40కిపైగా ఎద్దులు, ఆవులు మృతి చెందగా అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు కూలీలు చనిపోయారు. కంటైనర్‌లో సామర్థ్యానికి మించి పశువులను కుక్కి తరలించడం వల్ల ప్రమాదం తీవ్రత పెరిగింది. గతంలో అనంతపురం నుంచి తాడిపత్రి మీదుగా చెన్నైకు కంటైనర్‌లో తరలిస్తున్న పశువులను తాడిపత్రి బైపాస్ రోడ్డులో బీజేపీ నాయకులు పట్టుకొని పోలీసు అధికారులకు అప్పగించారు. ఈ మధ్యకాలంలో పోలీసు అధికారుల నిఘా కొరవడటం వల్ల కూడా తిరిగి తాడిపత్రి ప్రాంతం నుంచి చెన్నైకు అక్రమంగా పశువుల రవాణా సాగుతోందన్న ప్రచారం ఉంది. వారాంతపు సంతలతోపాటు దొంగిలించి తెచ్చిన పశువులను ఎక్కువగా కబేళాలకు అక్రమంగా తరలిస్తున్నారు.

చెక్‌పోస్టులలో అవినీతితో..

రాష్ట్ర సరిహద్దుల్లోని చెక్‌పోస్టులు అవినీతికి చిరునామాగా మారాయి. తెలంగాణా రాష్ట్రం సరిహద్దు చెక్‌పోస్టు మహబూబ్‌నగర్, కర్ణాటకకు కొడికొండ చెక్ పోస్టు ఉన్నాయి. నిత్యం ఈ చెక్‌పోస్టుల ద్వారానే పశువుల కంటైనర్లు అక్రమంగా తరలివెళుతున్నా పట్టించుకొనే నాథుడే లేడన్న ఆరోపణలు ఉన్నాయి. ఆయా చెక్‌పోస్టుల వద్ద పక్క రాష్ట్రాల నుంచి వచ్చే ప్రతి వా హనాన్ని తనిఖీ చేసిన తర్వాతే అనుమతించాల్సి ఉంటుంది. కానీ తనిఖీ అధికారులు కొందరు అవినీతికి పాల్పడుతుండటం వల్ల యథేచ్ఛగా కంటైనర్లు ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్నాయి. రవాణా సమయంలో కొందరు ఏజెంట్లు ముందుగా దళారుల సమాచారాన్ని పోలీసులకు అందిస్తూ అడ్డుతగలకుండా ముడుపులతో జాగ్రత్త పడుతున్నారు. తనిఖీలకు పాత తేదీలతో కూడిన రసీదులను చూపిస్తూ తప్పించుకొనే ప్రయత్నం చేస్తున్నారు.

రాత్రి సమయాల్లో అక్రమ రవాణా

పశువులను రాత్రి సమయాల్లో ఎక్కువగా అక్రమంగా రవాణా చేస్తుంటారు. పగటి సమయంలో ట్రాఫిక్ తీవ్రత ఎక్కువగా ఉండడంతోపాటు వివిధశాఖల అధికారుల తనిఖీలు కూడా జరుగుతాయన్న ఆలోచనతో అక్రమార్కులు రాత్రి సమయాల్లో రవాణా చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పశువులను తెచ్చి బెంగళూరుకు రవాణా చేస్తున్నారు. తెలంగాణ నుంచి బెంగళూరుకుకు దాదాపు 500 కిలోమీటర్ల దూరం ఉంటుంది. రాత్రి అంతా వాహనం నడిపితే ఉదయానికి బెంగళూరుకు చేరుకోవచ్చున్న ఆలోచనతో రాత్రి సమయాల్లో పశువులను రవాణా చేస్తున్నారు. పశువులను అక్రమంగా రవాణా చేసే కంటైనర్‌లకు బాడుగలు కూడా అధికంగా ఉంటాయి. డ్రైవర్లు, కూలీలకు కూడా ఎక్కువ మొత్తాల్లో చెల్లిస్తుంటారు.


మృతి చెందిన మూగజీవులను వాహనంలో తరలిస్తున్న దృశ్యం (ఫైల్)

నిబంధనలు బేఖాతర్

పశువుల రవాణాలో వ్యాపారులు నిబంధనలను బేఖాతర్ చేస్తున్నారు. నిబంధనల ప్రకారం ఒక్కొక్క కంటైనర్‌లో 16 పశువులను, వ్యాన్లలో ఆరింటిని మాత్రమే ఎక్కించాలి. పశువు, పశువుకు మధ్య రెండుమీటర్ల దూరం ఉండాలి. రవాణా సమయంలో వాహనంలో మేత, తాగునీటి సదుపాయం కల్పించాలి. కానీ 50 నుంచి 60 పశువులను ఒక్కో కంటైనర్‌లో కుక్కేస్తున్నారు. దీంతో గమ్యం చేరేటప్పటికి కొన్ని పశువులు గాయపడుతున్నాయి. ఆవులు, వ్యవసాయానికి ఉపయోగపడే ఎద్దులు, దూడలు కబేళాలకు తరలించడం నేరం. వీటికి వ్యాపారులు తిలోదకాలు ఇస్తున్నారు. గతంలో రైతుల అవసరాల కోసం ఏర్పడ్డ సంతలు నేడు పశువులను కబేళాల తరలించడానికి ఓ వేదికగా మారాయి. పశువులను కబేళాలకు త రలించడానికి పశువైద్యశాఖ అధికారుల అనుమతితో కూడిన పత్రాలు తప్పనిసరిగా ఉండాలి. ఆయా సంతల నిర్వాహకులే కొందరు సొంతంగా అనుమతి పత్రాలను తయారు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. సంతలను పర్యవేక్షించాల్సిన మార్కెటింగ్‌శాఖ అధికారులు, పశుసంవర్థక, పోలీసుశాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. ఒక రాష్ట్రానికి చెందిన పశువులను మరో రాష్ట్రానికి తరలించరాదన్న నిబంధనను పాటించడం లేదు.

అమలుకాని చట్టాలు

పశువుల అక్రమ రవాణాను అరికట్టడానికి పలు చట్టాలు అమలులో ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. 1975లో గోవధను నిషేధిస్తూ చట్టం అ మలులోకి వచ్చింది. ఈ చట్టాన్ని అతిక్రమించిన వారికి ఏడేళ్ల జైలుశిక్ష విధించడంతోపాటు జరిమానా విధించే అవకాశం ఉంది. ఈ చట్టాన్ని పోలీసులు, రవాణాశాఖ అధికారులు సమర్థవంతంగా అమలు చేయలేక పోతున్నారు. 1978లో జంతువులపై క్రూరత్వ నివారణ చట్టం అమలులోకి వచ్చింది. అక్రమ రవాణా, హింసలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకొనే అవకాశం ఉంది. ఈ చట్టాన్ని ఎవరూ సక్రమంగా అమలు చేయడం లేదు.


మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న పరిటాల సునీత

14న పోలేపల్లికి నారా భువనేశ్వరి రాక

రామగిరి, ఫిబ్రవరి 9: నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా నారా భువనేశ్వరి ఈనెల 14న పోలేపల్లికి రానున్నారని మాజీ మంత్రి పరిటాల సునీత శుక్రవారం తెలిపారు. సాయంత్రం పోలేపల్లి గ్రామానికి వెళ్లి అక్కడి నాయకులు, కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అరెస్టును జీర్ణించుకోలేక పోలేపల్లి గ్రామానికి చెందిన వెంకటరాముడు గతేడాది అక్టోబరు 13న మృతిచెందాడు. దీంతో ఆయన కుటుంబసభ్యులను పరామర్శించడానికి నారా భువనేశ్వరి రానుందని మాజీమంత్రి తెలిపారు. అనంతరం కార్యక్రమ విజయవంతంపై ఆమె పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమీక్షించారు. కార్యక్రమంలో టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్దిరంగయ్య, నాయకులు రామ్మూర్తినాయుడు, పరంధామయాదవ్, చంద్రప్ప, శ్రీరాములు, తిమ్మానాయుడు, శ్రీనివాసులు, మల్లికార్జున, మురళి, నందగోపాల్, పాపిరెడ్డిపల్లి రమేశ్ ఉన్నారు.

అనంత బాలోత్సవాన్ని జయప్రదం చేయండి

● ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి


బాలోత్సవం పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం


అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 9: అనంత బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 12, 13, 14 తేదీల్లో నిర్వహించనున్న అనంత బాలోత్సవంలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆర్ట్స్ కళాశాలలోని ఆయన చాంబర్‌లో అనంత పిల్లల పండుగ-4 పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నిత్యం చదువులు, మార్కుల వేటలో సతమతమయ్యే విద్యార్థులు తమలో దాగున్న సృజనాత్మకత, కళానైపుణ్యత వంటివి ప్రదర్శించడానికి అనంత బాలోత్సవం చక్కటి వేదిక అవుతుందన్నారు. జిల్లాలో ఇప్పటికే మూడుసార్లు బాలోత్సవం నిర్వహించామని, ఇందులో వందలాదిమంది విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారని గుర్తుచేశారు. మూడు రోజులు నిర్వహించే ఈ కార్యక్రమంలో అకడమిక్, కల్చరల్స్, సాంస్కృతిక, జానపద కళలు, వ్యాసరచన, వక్తృ త్వం, చిత్రలేఖనం, ఆటలు, పాటలు, క్విజ్, సైన్స్ ఎగ్జిబిషన్ వంటి పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పాల్గొనే విద్యార్థులందరికీ ప్రశంసాపత్రాలతో పాటు విజేతలకు బహుమతులు, జ్ఞాపికలు అందిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల అధ్యాపకురాలు అరుణశ్రీ, బాలోత్సవ కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి సావిత్రి, అధ్యాపకుడు లక్ష్మీకాంత్, ఉషారాణి, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు రామాంజినమ్మ, నాయకురాలు గీత తదితరులు పాల్గొన్నారు.


రేపు జిల్లా స్థాయి చెస్ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 9: జిల్లా స్థాయి అండర్-15 పాఠశాల క్రీడాకారులకు చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు కోచ్ హుస్సేన్ ఖాన్ తెలిపారు. బళ్లారిరోడ్డులోని వెరిడియన్ ఎకోల్ పాఠశాలలో ఈనెల 11న జిల్లా స్థాయి అండర్ 7, 9, 11, 13, 15 బాలబాలికల కేటగిరిలలో చెస్ పోటీలు జరుగుతాయన్నారు. పాఠశాలల్లో చదువుతున్న చెస్ క్రీడాకారులను ప్రోత్సహించడానికే ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్, ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్ సహకారంతో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు సెల్ నంబరు 8008161811ను సంప్రదించాలని కోరారు.

తప్పుల తడకగా ఓటర్ల జాబితా

● నివాసం ఒకచోట.. పోలింగ్ కేంద్రం మరోచోట.. ● ధర్మవరంలో ఒకే డోర్ నంబర్‌తో నాలుగు ఓట్లు ● డబుల్ ఎంట్రీలు యథాతథం


ఒకే కేంద్రంలో రెండు ఓట్లు కలిగిన ఓటర్లు


పోలింగ్ కేంద్రానికి మార్చిన ఫొటో



రాయదుర్గంలో ఒకే పేజీలో రెండుచోట్ల నమోదైన ఓట్లు

కదిరి, ఫిబ్రవరి 9: తుది ఓటరు జాబితాలో తప్పులు కుప్పలుగా కనిపిస్తున్నాయి. బీఎల్‌వోలు క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లకుండా ఇష్టారాజ్యంగా ఓటరు నమోదు ప్రక్రియను పూర్తి చేశారనేందుకు అనేక ఉదాహరణలు కనిపిస్తున్నా యి. ఒక వ్యక్తికి రెండు నియోజక వర్గాల్లో ఓటు ఉంటే, మరోచోట ఒకే పోలింగ్ బూత్‌లోనే రెండు ఓట్లు ఉన్నాయి. చనిపోయినవారికి ఓటు హక్కు కల్పించారు బీఎల్‌వోలు. కదిరి పట్టణంలో నివాసం ఉండేవారికి ఏడు కిలోమీటర్ల దూరంలో ఉండే పోలింగ్ కేంద్రాన్ని కేటాయించారు. పార్టీల నాయకులు ఫిర్యాదులు చేసినా వాటిని పట్టించుకోకుండా యథాతథంగా తుది జాబితా ప్రకటించారు.

● కదిరి నియోజకవర్గంలో 241 పోలింగ్ కేంద్రంలో జీ సుస్మితకు రెండు ఓట్లు ఉన్నాయి. సీరియల్ నెంబర్ 141, 143 ఇదే కేంద్రంలో కడపల హరినాథ్ రెడ్డికి సీరియల్ నంబర్ 227, 237 రెండు ఓట్లు ఉన్నాయి. ఆర్ఆర్‌వీ 2374999, 1967637. 172 కేంద్రంలో జీ. మమతకు సీరియల్ నెంబర్ 78, 794లో రెండు ఓట్లు ఉన్నాయి. పోలింగ్ కేంద్రం నెంబర్ 180లో సీరియల్ నంబర్ 576, 1073లలో తిమ్మబోయిన ప్రతాప్‌కు రెండు ఓట్లు ఉన్నాయి. 1007, 766 నెంబ ర్లతో కుప్పల సుకన్యకు రెండు ఓట్లు కల్పించారు. 936, 948 నెంబర్లతో సిద్ధవటం వేణుగోపాల్‌రెడ్డికి రెండు ఓట్లు ఉన్నాయి. పోలింగ్ స్టేషన్ నెంబర్ 172లో సీరియల్ నెంబర్ 547లో అంజన్‌రెడ్డి అనే వ్యక్తి ఫోటోకు బదులు మరోకరి ఫొటో పెట్టారు. బూత్ నెంబర్ 172లో సీరియల్ నెంబర్ 262 గల ఎన్. రూపకు కొన్ని సంవత్సరాల కిందట వివాహం అయింది. అయినా ఓటు తొలగించలేదు. ఇదే కేంద్రంలో సీరియల్ నెంబర్ 376లో ఆచారి కృష్ణమ్మ చనిపోయినా ఓటు తొలగించలేదు. ఎంఎక్స్‌కే 1579648. బూత్ నంబర్ 180లో సీరియల్ నంబర్ 510లో ఉన్న శ్రీనివాసులు, 536 వల్లెపు లక్ష్మీదేవి, 852లో ఉన్న రామక్రిష్ణారెడ్డిలు చనిపోయిన ఓట్లు తొలగించలేదు.

ఒకే డోర్ నంబర్‌లో నాలుగు ఓట్లు

ధర్మవరంరూరల్ : మండలంలోని నిమ్మలకుంట గ్రామంలో ఓటరు జాబితాలో మళ్లీ అవే తప్పులు వచ్చాయి. గ్రామంలోని పోలింగ్ కేంద్రం నెంబర్ 281లో సీరియల్ నెంబర్లు 68, 69, 488, 500 లో హేమంత్‌జ్యోతి, జ్యోతి హేమంత్ పేరు మీద డోర్ నెంబర్ 5-25-1లో నాలుగు ఓట్లు వచ్చాయి. ఇంటింటి సర్వే చేసినా మళ్లీ డబుల్ ఓట్లు రావడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



పోలింగ్ కేంద్రాలే మార్చేశారు..

పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉండే ఓటర్ల పోలింగ్ కేంద్రాలనే మార్చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని కుటాగుళ్లలోని కుటాగుళ్ల ప్రధాన రహదారి, దర్గావీధి, పులివెందుల రోడ్డు, ఎస్‌సీ కాలనీ, ఎస్‌టీ కాలనీ, తారక రామనగర్, వాల్మీకి రోడ్డులలో ఉండే ఓటర్లకు కుటాగుళ్లలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఉండేది. ప్రస్తుతం అక్కడి వారికి దాదాపు ఏడు కిలోమీటర్ల దూరంలో ఉండే సెరికల్చర్ మార్కెట్ యార్డులోని పోలింగ్ కేంద్రానికి మార్చారు. పట్టణంలోని మెయిన్ రోడ్డు, హిందుపురం రోడ్డు, సింహకోట, గుడి పడమర వీధి, బ్రహ్మణ వీధిలోని ఓటర్లుకు అమృతవల్లి డిగ్రీ కళాశాలలో పోలింగ్ కేంద్రం ఉండేది. ఇప్పుడు క్లాక్‌టవర్ వద్ద ఉన్న రాణీపేట పాఠశాలకు మార్చారు. గొల్లమ్మ మండపం వద్ద ఉన్న ఓ పోలింగ్ కేంద్రాన్ని చావిడి పోలింగ్ కేంద్రానికి మార్చారు.

డబుల్ ఎంట్రీలను తొలగించని అధికారులు


నమోదైన డబుల్ ఎంట్రీలు

ఆత్మకూరు: మండలంలో ఓటరు జాబితాలో డబుల్ ఎంట్రీల తొలగింపు పై అధికారులు స్పందించక పోవడంతో గ్రామాల్లో రాజకీయ చిచ్చు రేగుతుంది. మండలంలోని 17 గ్రామ పంచాయల్లో 800కు పైగా తొలగింపునకు దరఖాస్తులు అందజేశారు. అయితే బి యాలేరుపై కొత్తపల్లి,తోపుదుర్తి గ్రామాల్లో సందిగ్ధత నెలకొంది. బి యాలేరు గ్రామంలో లేనివారివి కూడా ఓటర్లు ఉన్నట్లు ఫిర్యాదులు చేస్తే బిఎల్ ఓ మాత్రం పట్టించుకోకపోడం ఏమిటని గ్రామస్థులు మండి పడుతున్నారు. ఎన్‌డీఎఫ్0820572 వెంకటరమణారెడ్డి మాగంటి తండ్రి కేసన్న మంగ పాటి, ఎన్‌డిఎఫ్0820580వ వసుందర మంగపాటి, భర్త రమణారెడ్డి మంగపాటి పేరుమీద అనంతపురం మూరుతినగర్ బూత్ 113లో ఉన్నాయి. బి యాలేరు గ్రామంలో కూడా వైడబ్లు3052826 నంబరుతో రమణారెడ్డి,వైడబ్లుబి2974954తో వసుందర పేర్లుబూత్ నంబరు 29లో నమోదయ్యాయి. దీంతో పాటు ఎన్‌డీఎఫ్ 1043470 పుల్లారెడ్డి తండ్రి ఎర్రెప్ప పేరు యాలేరులో బూత్ నంబరు 29లోఉంది ఇదే ఓటు అనంతపురంలోని బూత్ నంబరు 101లో డిజిఎన్ 1193259 నంబరులో పుల్లారెడ్డి పేరు నమోదు అయింది. ఫిర్యాదు చేసిన వారిపై గొడవలకు దిగి బెదిరిస్తున్న ప్రచారం జరుగుతుంది.

ప్రతి పేజీలోనూ తప్పులే..


8 చోట్ల జీరో డోర్ నంబర్‌లు

రాయదుర్గం: ఎన్నికల సంఘం విడుదల చేసిన ఓటర్ల జాబితాలో ప్రతి పేజీలో తప్పులు కనిపిస్తున్నాయి. రాయదుర్గం నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల్లో ఉన్న ఓటర్ల జాబితాలను పరిశీలిస్తే తప్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దీంతో ఎన్నికల అధికారులు చేసిన కసరత్తు ఎంతమేరకు సరిగ్గా చేశారో దీన్ని బట్టి అర్థమవుతోంది. ముఖ్యంగా 212 బూత్‌నంబర్‌లో ఉన్న ఓటర్ల జాబితాలో ఒకే పేజీలో ఎనిమిది మంది ఓటర్లకు డోర్‌నంబర్లు లేవు. జీరో డోర్ నంబర్‌తో అడ్రస్సులు లేకుండా అలాగే ముద్రించడం విమర్శలకు తావిస్తోంది. అదే విధంగా 212 బూత్‌నంబర్‌లో ఉన్న సీ కరుణాకర్ అనే యువకుడి ఓటు 850 సీరియల్ నంబర్‌లో ఉండగా 221 బూత్‌నంబర్‌లో 329 సీరియల్ నంబర్‌లో చందా కరుణాకర్ పేరుతో రెండవచోట ఓటు నమోదైంది. డబుల్ ఎంట్రీలు ఉండడంతో పాటు జీరో డోర్‌నంబర్‌లు ఉండడం చూస్తే పారదర్శకత ఏమాత్రం కనిపించడం లేదు. అలాగే డీ నందిని అనే ఓటరుకు సంబంధించి 1431 సీరియల్ నంబర్‌లో ఉండగా అదే పేజీలో 1434 సీరియల్ నంబర్‌లో డీ నందిని పేరుతో రెండవ ఓటు పైన, కింద ఒకే ఫొటోతో ముద్రించారు. దీంతో ఓటర్ల జాబితాలోని తప్పులు ఎక్కడికక్కడ అగుపిస్తుండడంతో రాజకీయపార్టీలు తలపట్టుకుంటున్నాయి.

12వ పీఆర్సీ కోసం రాష్ట్రవ్యాప్త ఉద్యమం: ఏపీటీఎఫ్

అనంతపురం విద్య, ఫిబ్రవరి 9: ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లకు 12వ పీఆర్సీ కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపట్టనున్నట్లు ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నరసింహులు పేర్కొన్నారు. శుక్రవారం ఆ సంఘం నాయకులు ఉపాధ్యాయభవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహులు మాట్లాడుతూ ఉద్యోగులు, పెన్షనర్లకు జూలై 2023 నుంచి వర్తించే విధంగా 12వ పీఆర్సీ అమలు చేయాలని ఉద్యమించ నున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 12వ వేతన సవరణ సంఘం కమిషన్‌ను ఏర్పాటుచేసి ఆ రు నెలలైనా కమిషన్ ఇంత వరకూ ఎలాంటి బాధ్యతలు తీసుకోలేదన్నారు. ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో సీఎం జగన్ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులతో చర్చించి 30 శాతం ఫిట్ మెంట్ పీఆర్సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. 2018 నుం చి రావాల్సిన కరువు భత్యం, ఇతర బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. 11వ పీఆర్సీ బకాయిలును సైతం వెంటనే ఇవ్వాలన్నారు. ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 6100 పోస్టులతో కాకుండా 20 వేల పోస్టులతో డీఎస్సీ ప్రక టించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేష్, జిల్లా ప్రధానకార్యదర్శి సిరాజుద్దీన్, ఇతర నాయకులు ప్రభాకర్, బొమ్మయ్య, భాస్కర్, సతీష్, చెన్నకేశవులు, హనుమప్ప, వెంకటరమణ, కృష్ణ, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నరసింహులు

ముగిసిన సయ్యద్ సాలార్ ఉరుసు

శింగనమల, ఫిబ్రవరి 9: శింగనమలలో మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న హజరత్ సయ్యద్ సాలార్ మసూద్ గాజి ఉరుసు శుక్రవారంతో ముగిసింది. శుక్రవారం ఉదయం జియారత్ సందర్భంగా ఫాతెహా కార్యక్రమంలో స్వామి వారికి భక్తులు చెక్కర చదివింపులు సమర్పించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రి తెలుగు, హిందీ పాటల ఆర్కెస్ట్రాతో ఉరుసు కార్యక్రమం ముగిసింది. **దర్గాకు దండు విరాళం :** శింగనమల హజరత్ సయ్యద్ సాలార్ మసూద్ గాజి దర్గా ఉరుసు నేపథ్యంలో రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు గురువారం రాత్రి రూ.10 వేలను ముజావర్ హరిష్‌కు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో గంగాధర్, కుళ్లాయప్ప, ఆదినారాయణ, బండిపరుసురాం, కాయల సురేష్, రాయల్ దండు సత్తి, వెంకట రమణ, నారాయణస్వామి, బండిపసురాం, రాజుబాబు పాల్గొన్నారు.

ఎన్‌ఈపీతో ఉన్నత విద్య నిర్వీర్యం: ఏఐఏఎస్‌ఏ

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 9: నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ-2023 (ఎన్‌ఈపీ)ని అమలు చేసి ఉన్నత విద్యావ్యవస్థను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఏఐఏఎస్‌ఏ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వేమన మండిపడ్డారు. విశ్వవిద్యాలయాల్లో నిర్వహించిన మూడు రోజుల యంగ్ ఇండియా పోల్ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా వేమన మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వస్తేనే ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీచేస్తామని చెప్పి.. నేటికి ఏ ఉద్యోగమూ ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజునాయక్, వంశీకృష్ణ, భాను, యమున, మనోహర్, నరేష్, ఆనంద్ పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వానికి గిరిజనుల అభివృద్ధి పట్టదా..!

తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటప్ప



అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 9: జగన్ ప్రభుత్వానికి గిరిజనుల అభివృద్ధి పట్టదా అని తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటప్ప ధ్వజమెత్తారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక తెలుగు యువత కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. గిరిజనుల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించినా, రాష్ట్రం ప్రభుత్వం తన వాటా నిధులు ఖర్చు చేయకపోవడం దారుణమన్నారు. ఎస్టీలపై దాడులు, అరాచకాల్లో రాష్ట్రం మొదటి స్థానంలో ఉందన్నారు. రాబోవు ఎన్నికల్లో ఆదివాసులు, గిరిజనలు ఏకమై ఓటుతో వైసీపీకి బుద్ధిచెప్పాలన్నారు.

టీడీపీ పాలనలోనే గిరిజనుల అభివృద్ధి

ఆత్మకూరు ఫిబ్రవరి 9: రాష్ట్రంలో గిరిజన గ్రామాలు, ప్రాంతాలు టీడీపీ పాలనలోనే అభివృద్ధి చెందాయని, వైసీపీ హయాంలో జరిగిన అభివృద్ధి శూన్యమని ఎస్‌టీసెల్ పార్లమెంటు ఉపాధ్యక్షుడు వెంకటేసులు విమర్శించారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. గురువారం ఎస్‌టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ పర్యటన వల్ల ఎలాంటి ఉపయోగమూ లేదన్నారు. గ్రామాన్ని పరిశీలించకుండా.. వారి స్థితిగతులను అడకుండానే వెళ్లిపోయారని విమర్శించారు. వైసీపీ పాలనలో ఏ ఒక్క గిరిజనుడూ బాగు పడలేదన్నారు.

నాసా పరీక్షలో 'శ్రీచైతన్య' ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఏజీఎం

అనంతపురం విద్య, ఫిబ్రవరి 9: నాసా పోటీ పరీక్షల్లో తమ పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు ప్రతిభ చాటారని శ్రీచైతన్య స్కూల్ ఏజీఎం సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం కమ్మభవన్ వద్ద ఉన్న శ్రీచైతన్య స్కూల్‌లో ఆ విద్యార్థులకు నిర్వహించిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. అమెరికాకు చెందిన నాసా నేషనల్ స్పేస్ సొసైటీ ఇటీవల ప్రపంచ వ్యాప్తంగా 'లివ్ ఇన్ ఏ హెల్తీ స్పేస్' అనే పేరుతో 12 ఏళ్ల నుంచి 18 ఏళ్లలోపు విద్యార్థులకు పోటీ పరీక్ష నిర్వహించిందన్నారు. అనంతపురం జోన్‌కు చెందిన గుంతకల్లు-1, తాడిపత్రి బ్రాంచ్‌కు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో ప్రతిభ చూపారన్నారు. అదేవిధంగా 'ఆర్బిట్ గ్రో, అగ్రి ఒప్యులెన్స్' అనే ప్రాజెక్టులకు తమ విద్యార్థులు ఎంపికైనట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు విశ్వనాథ్, వీరేష్‌బాబు, బాబు, కో-ఆర్డినేటర్లు రాధాకృష్ణ నాయుడు, తిరుమలేష్, శ్రీనివాసులు, నాగభూషణం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో సమష్టిగా పనిచేద్దాం: ఎస్పీ

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 9: రానున్న ఎన్నికల్లో అన్ని ప్రభుత్వ విభాగాలు కలిసి సమష్టిగా, పారదర్శకంగా పనిచేద్దామని ఎస్పీ అన్బురాజన్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో ఇతర ప్రభుత్వ విభాగాల అధికారులతో ఆయన కో-ఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించడానికి అందరూ సహకరించాలని కోరారు.

తాళిబొట్టు చోరీ

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 9: అనంతపురం రూరల్ మండలం పాత కురుగుంటకు చెందిన లక్ష్మినరసమ్మ శుక్రవారం మధ్యాహ్నం ఎనుములు మేపడానికి సమీపంలోని పొలానికి బయలుదేరింది. బైక్‌లో వచ్చిన ఓ యువకుడు ఆమె మెడలోని మూడు తులాల తాళిబొట్టు గొలుసును లాక్కొని వెళ్లిపోయాడు. బాధితురాలు అనంతపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

టీడీపీకి పెరుగుతున్న ఆదరణ: కాలవ



కండువాలు కప్పి పార్టీలో ఆహ్వానిస్తున్న కాలవ

రాయదుర్గం/రూరల్, ఫిబ్రవరి 9: నియోజకవర్గంలో తెలుగుదేశంపార్టీకి రోజురోజుకు ప్రజాదరణ పెరుగుతోందని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం ఉదయం ఆయన ఆయతపల్లి గ్రామం నుంచి 25 కుటుంబాలు, పట్టణంలోని 20వ వార్డులో కామయ్యతోటకు చెందిన 40 కుటుంబాల వారికి టీడీపీ కండువాలతో సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లు కూడా రావడం లేదన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ తమకు రావడం లేదని రైతులు ఆవేదన చెందారు. టీడీపీ హయాంలో ఇన్‌పుట్ సబ్సిడీ, పంట రుణాలు సక్రమంగా అందేవని గుర్తు చేశారు. కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో సాగుతున్న అరాచకాలను తట్టుకోలేని చాలా మంది టీడీపీలోకి వస్తున్నారన్నారు.

స్టాఫ్‌నర్సు దాతృత్వం

అనంతపురం టౌన్ : జిల్లా సర్వజన ఆస్పత్రిలో స్టాఫ్‌నర్స్ మరియమ్మ తన దాతృత్వాన్ని చాటుకున్నారు. పసిపిల్లలకు చికిత్స అందించే ఐసీసీయూ వార్డుకు 10 స్టూల్స్‌ను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమెను సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, ఇతర ఉద్యోగులు అభినందించారు.

ఓటమికి వైసీపీ సిద్ధం..!

టీడీపీ గెలుపు తథ్యం..: మాజీ మంత్రి పరిటాల సునీత

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 9: వచ్చే ఎన్నికలో ఓటమికి వైసీపీ సిద్ధంగా ఉందని, టీడీపీ గెలుపు కళ్ల ముందే కనిపిస్తోందని మాజీ మంత్రి పరిటాల సునీత అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో మండలంలోని ఉప్పరపల్లి నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. విబేధాలు వీడి.. టీడీపీ గెలుపే లక్ష్యంగా అందరం కలసికట్టుగా పని చేయాలన్నారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకుని రావాలన్నారు. వైసీపీలో విబేధాలతో ఆ పార్టీ నాయకులు టీడీపీలోకి వస్తారన్నారు. టీడీపీ, జనసేన ఉమ్మడి మినీ మ్యానిఫెస్టోను ఇంటింటికి వెళ్లి వివరించాలన్నారు. వైసీపీ అరచాకాలను, ఎమ్మెల్యే వైఫల్యాలపై ప్రజలను చైతన్యం చేయాలన్నారు. ఈ రెండు నెలలు కష్టపడితే భవిష్యత్ అంతా మనదే నన్న సంగతి మరచిపోవద్దన్నారు.



ఉప్పరపల్లి నాయకులతో మాట్లాడుతున్న పరిటాల సునీత

సైకో రెడ్డిని సాగనంపుదాం

టీడీపీ నియోజకవర్గ నాయకురాలు బండారు శ్రావణిశ్రీ



సిద్దరాంపురంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న బండారు శ్రావణిశ్రీ, ప్రసన్నాయపల్లిలో టీడీపీ నాయకులు

బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి 9: రాష్ట్రంలో సైకోరెడ్డిని గద్దె దింపి... రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే చంద్రబాబును మళ్లీ సీఎం చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ నియోజకవర్గం నాయకురాలు బండారు శ్రావణిశ్రీ అన్నారు. శుక్రవారం బాబు ష్యూరిటీ... భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని మండలంలోని సిద్దరాంపురం గ్రామంలో నిర్వహించారు. మొదట ఆ గ్రామంలోని కొల్లాపురమ్మ దేవాలయం వద్ద బండారుశ్రావణిశ్రీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో నియోజకవర్గంలోని ఆరు మండలాల కార్యకర్తలూ పాల్గొన్నారు. గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి టీడీపీ మ్యానిఫెస్టో కరపత్రాలను పంచారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పసుపుల హనుమంతురెడ్డి, నారాయణరెడ్డి, పొడరాళ్ల రవీంద్రా, ఓబులపతి, పెద్దప్ప మాజీ జెడ్పీటీసీ షాలినీ దొర, జీసీబాబు, గుత్తా ఆదినారాయణ, చిదానందానాయుడు, కులశేఖర్ బాబు, మహేశ్వర్‌రెడ్డి, చల్లానాగరాజు, గుత్తాహరి పాల్గొన్నారు.

రాప్తాడు : మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీ చిన్మయ్‌నగర్‌లో హిందూపురం పార్లమెంట్ మహిళా కమిటీ ప్రధాన కార్యదర్శి రామసుబ్బమ్మ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హిందూ పురం పార్లమెంట్ నాయకురాలు పంజగల ప్రసన్న, రాప్తాడు మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు స్వర్ణక్క, ధనుంజయ పాల్గొన్నారు.

తెలుగు భాషను సుస్థిరపరచాలి



మాట్లాడుతున్న శ్యామసుందర

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 9: తెలుగు భాషా వైభవాన్ని సుస్థిర పరిచేవిధంగా భాషాభిమానులు కృషి చేయాలని శ్రీసాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ దామోదర రెడ్డి, తెలుగు భాషా వికాస సభ్యుడు శ్యామసుందర శాస్త్రి పిలుపునిచ్చారు. శుక్రవారం 'తెలుగు భాషా వైభవం' అనే అంశంపై ఆ కళాశాలలో నిర్వహించిన సదస్సులో వారు మాట్లాడారు. పంచదార, పనస తొనలు, తేనె కన్నా తెలుగు భాష మిన్న అని దశాబ్దాలుగా అనేక మంది కవులు, రచయితలు కీర్తిస్తున్నా రన్నారు. విజయనగర చారిత్రక శకానికి చెందిన శ్రీకృష్ణదేవరాయలు 16వ శతాబ్దంలోనే తెలుగు సాహిత్యపు స్వర్ణయుగం వికసించిందన్నా రు. నేటి సాంకేతిక యుగంలోనూ అంతర్జాల మాధ్యమాల్లో తెలుగు భాషకు ప్రత్యేక ఆదరణ లభిస్తోందన్నారు. అయితే విదేశీభాష మోజు లో తెలుగు భాషలో అనేక పదాలను చొప్పించడం ప్రమాదక రమ న్నారు. తెలుగు భాషకు పూర్వ వైభవం సంతరించేలా కృషిచేయా లని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు నరసిం హు లు, గౌసియా, దివ్య, చలపతి, పవన్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎస్టీయూ నగర కమిటీ ఏర్పాటు



ప్రభాకర్, సురేష్‌కుమార్

అనంతపురం విద్య, ఫిబ్రవరి 9: ఎస్టీయూ నగర కమిటీని శుక్రవారం స్థానిక నగర పాలకసంస్థ రాజేంద్ర మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా సురేష్‌కుమార్, కోశాధికారిగా నరసింహులును ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్రకౌన్సిలర్లు రామాంజినేయులు, ఫణిభూషణ్, జనార్ధన్, అనూరాధ, నగర నాయకులు దివాకర్ నాయుడు, కృష్ణమూర్తి, నాయుడు, జయరాములు, విరూపాక్షి గౌడ్, శ్రీనివాసులు, మురళీకృష్ణ పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయండి

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 9 : అనంతపురం డివిజన్ పరిధిలో పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక అనంతపురం డివిజన్ కార్యాలయంలో ఏడీఏ రవి, ఆరు మండలాల ఏఓలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల కోడ్ వచ్చేలోగా డివిజన్ పరిధిలో వ్యవసాయశాఖ పరంగా పనులు పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలని సూచించారు.

వెట్టిచాకిరీ వ్యవస్థను నిర్మూలిద్దాం



ప్రతిజ్ఞ చేస్తున్న కార్మికశాఖ సిబ్బంది

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 9: జిల్లాలో వెట్టిచాకిరి వ్యవస్థను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా కార్మికశాఖ ఉపకమిషనర్ లక్ష్మినరసయ్య పేర్కొన్నారు. వెట్టిచాకిరి వ్యవస్థ నిర్మూలన దినాన్ని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా కార్మికశాఖ కార్యాలయంలో ఆయన సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఉప కమిషనర్ మాట్లాడుతూ... వెట్టిచాకిరి వ్యవస్థలో చిక్కుకున్న కార్మికుల వివరాలను జిల్లా కార్మికశాఖకు అందించాలని, ఆ నిర్వాహకులపై తగు చర్యలు తీసుకొని ఆ కార్మికులకు విముక్తి కల్పిస్తామని అన్నారు. కార్యక్రమంలో కార్మికశాఖ ఏఎల్ఓలు రాధారమాదేవి, సుజాత పాల్గొన్నారు.

ఎంఎన్‌ఓల సమస్యలు పరిష్కరించండి

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 9: ఆస్పత్రిలో పనిచేస్తున్న ఎంఎన్‌ఓలు, ఎఫ్ఎన్‌ఓల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సీఐటీయూ నేతలు గోపాల్, ముత్యాజా, కుమార్, సులోచనమ్మ ఎంఎన్‌ఓలతో కలిసి.. సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. ఆస్పత్రిలో పనిచేస్తున్న సుమారు 80 మంది ఎంఎన్‌ఓలకు మూడేళ్లు అవుతున్నా ఈఎస్ఐ కార్డులు ఇవ్వలేదని, వేతనాల్లో మాత్రం ఈఎస్ఐ సొమ్మును కట్ చేసుకుంటున్నారని అన్నారు. ఆరు నెలలు ఈపీఎఫ్ సొమ్ము వారి బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదని అన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా వచ్చే ఇన్సెంటీవ్‌ను వీరికి ఇవ్వడంలేదని, పైగా పని ఒత్తిడితో ఇబ్బందులు పెడుతూ అనేక రకాలుగా వేధిస్తున్నారని అన్నారు. వెంటనే ఈ సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

ఎన్నికల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి



ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 9: ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ ఆఫీసర్లు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ వీరశివారెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక డ్వామా సమావేశమందిరంలో అనంతపురం అర్బన్ అసెంబ్లీ నియోజకవర్గం సెక్టోరల్ ఆఫీసర్లకు ఒక్కరోజు శిక్షణ, అవగాహన సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. మాక్ పోలింగ్ తరువాత ఈవీఎంలను శుభ్రంగా ఉంచాలన్నారు. ఎప్పటికప్పుడు ఈవీఎంల భద్రత, అందులో ఉండే డేటాను సరిచేసుకోవాలన్నారు. ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ ముగిసేవరకు ప్రతి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. సున్నితమైన ఎన్నికల అంశంపై నిర్లక్ష్యం చేయొద్దండని తెలిపారు. ఈవీఎంల వినియోగం, ఆపరేటింగ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ శ్రీరాములు, సెక్టోరల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

16న 'కార్మికుల సమ్మె - గ్రామీణ బంద్'



సమావేశంలో మాట్లాడుతున్న గుజ్జల ఈశ్వరయ్య

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 9: దేశంలోని కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16న కార్మికుల సమ్మె- గ్రామీణ బంద్ కార్యక్రమాన్ని తలపెట్టినట్లు ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జల ఈశ్వరయ్య తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో కార్మిక, రైతు, సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్యలపై రైతులు, కార్మికులు పలుమార్లు ఆందోళన నిర్వహించినా కేంద్ర ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ఇకనైనా కేంద్ర ప్రభుత్వం తన వైఖరి మార్చుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇండ్ల ప్రభాకర్ రెడ్డి, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏసురత్నం, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శులు మల్లికార్జున, చంద్రశేఖర్‌రెడ్డి, రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి నాగరాజు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య పాల్గొన్నారు.

రేపు పాతపాటల ప్రేమికుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనం వివరాలు వెల్లడిస్తున్న పాతపాటల ప్రేమికులు

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 9: స్థానిక హౌసింగ్‌బోర్డు రాజీవ్ చిల్డ్రన్స్ పార్కు ఆవరణంలోని ఘంటసాల స్మారక మండపంలో ఆదివారం పాతపాటల ప్రేమికుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం నిర్వాహకుడు ఓబులదాస్ పేర్కొన్నారు. పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు 50వ వర్ధంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం ఘంటసాల మండపం వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఈ సమ్మేళనానికి ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి పాతపాటల ప్రేమికులు వందలాదిగా హాజరవుతున్నారన్నారు. అలనాటి దూరదర్శన్ వ్యాఖ్యాత విజయదుర్గ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. అనంతరం ఔత్సాహిక గాయకుల సంగీత విభావరి ఉంటుందన్నారు. కళాకారులు, కళాభిమానులు విరివిగా పాల్గొని ఈ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పాతపాటల ప్రేమికులు జీవిరామయ్య, శ్రీనివాసరావు, రామ్మోహన్‌రెడ్డి, దుర్గాప్రసాద్, సత్యనారాయణమూర్తి, కేశవ, శాంతి, శ్రీమణి, శ్రీదేవి, ఇందిర పాల్గొన్నారు.

రాత్రివేళ కులగణన - అడ్డుకున్న టీడీపీ శ్రేణులు

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 9: కులగణన పేరుతో ఓ మహిళా అధికారి రుద్రంపేట పంచాయతీ బీసీ కాలనీ, ఎస్సీ కాలనీల్లో శుక్రవారం రాత్రి 8.30 గంటల సమయంలో పర్యటించింది. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు అక్కడి చేరుకున్నారు. ఎవరు మీరు.. ఏ శాఖకు చెందిన వారు.. రాత్రి వేళల్లో ఈ కులగణన ఏంటని ప్రశ్నించగా.. సరైన సమాధానం ఇవ్వకుండా ఆమె వెళ్లిపోయారు. రాత్రివేళలో ఇలా పర్యటనకు రావడాన్ని ఆ ప్రాంతవాసులు తప్పుబట్టారు.

బటన్‌రెడ్డిని ఇంటికి పంపుదాం



శింగనమలలో సమావేశమైన జన సైనికులు

శింగనమల, ఫిబ్రవరి 9: ఎన్నిసార్లు బటన్ నొక్కినా అనేక మంది అర్హులకు సంక్షేమ పథకాలు అందడం లేదని, రానున్న ఎన్నికల్లో ఆ బటన్‌రెడ్డిని ఓడించేందుకు అన్ని వర్గాల ప్రజలూ సిద్ధంగా ఉన్నారని శింగనమల నియోజకవర్గం జనసేన సమన్వయకర్త సాకే మురళి అన్నారు. శుక్రవారం స్థానిక రామస్వామి దేవాలయంలో మండల జనసేన అధ్యక్షుడు తోట ఓబిలేసు అధ్యక్షతన నిర్వహించిన జనసేన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అరాచక పాలనను సాగనంపి.. టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. జిల్లా పార్టీ కార్యదర్శి చంద్రశేఖర్, కృష్ణ మూర్తి, విజయలక్ష్మి, వీరా, నాగేశమ్మ, ప్రవీన్, రాంమోహన్, శంకర్ పాల్గొన్నారు.

అక్రమ కేసులతో గొంతు నొక్కలేవు జగన్: జనసేన

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 9: ప్రతిపక్షాలపై అక్రమ కేసులు బనాయించినంత మాత్రాన వారి గొంతును నొక్కలేవు జగన్ అని జనసేన పార్టీ రాయలసీమ రీజినల్ ఉమెన్ కో-ఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత మండిపడ్డారు. శుక్రవారం ఆమె మహిళలతో మాటామంతి కార్యక్రమంలో భాగంగా 33వ డివిజన్‌లోని నాయక్‌నగర్‌లో పర్యటించారు. ఆమె మాట్లాడుతూ.... అంగన్‌వాడీ, ఆశా, డీఎస్సీ, నిరుద్యోగులు, సర్పంచ్‌లు రాజ్యాంగబద్ధంగా నిరసనలు, బావ ప్రకటన తెలియజేసే హక్కే లేకుండా చేశారని మండిపడ్డారు. ప్రజలంతా ఈ విషయాన్ని గమనించి రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ వీర మహిళలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు లక్ష్మీవెంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

రామగిరి, ఫిబ్రవరి 9: మండలంలోని మక్కిన వారిపల్లి సమీపంలో కర్ణాటక సరిహద్దున లక్ష్మీవెంకటేశ్వరస్వామి (గుడ్డమయ్యస్వామి) విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆ గ్రామస్థులు శుక్రవారం తెలిపారు. మక్కినవారిపల్లి, ఎగువపల్లి గ్రామస్థుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఆదివారం తెల్లవారుజామున 5గంటల సమయంలో ప్రతిష్ఠ ఉంటుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

300 లీటర్ల కర్ణాటక డీజిల్ సీజ్

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 9: కర్ణాటక నుంచి ఆటోలో 300 లీటర్ల డీజిల్‌ను అక్రమంగా తరలిస్తుండగా.. పెనుకొండ-మడకశిర ప్రధాన రహదారిలోని మావుటూరు వద్ద శుక్రవారం సీజ్ చేసినట్లు విజిలెన్స్ సీఐ వెంకటరమణ తెలిపారు. నిందితుడు నారాయణను అదుపులోకి తీసుకున్నామని, డీజిల్, ఆటోను సీజ్ చేసి పెనుకొండ సీఎస్‌డీటీ ప్రభావతికి అప్పగించామని తెలిపారు.

రేషన్ షాపుల తనిఖీ

రాప్తాడు మండలంలోని పుల్లలరేవు శ్రీరెడ్డి గారి మమత కు చెందిన రేషన్ షాపును విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. రికార్డుల కంటే ఎక్కువ నిలువలు ఉన్నట్లు గుర్తించారు. ఆ నిలువలను జప్తు చేసి స్థానిక రెవెన్యూ అధికారులకు అప్పగించారు.

టెట్, డీఎస్సీ.. ఎన్నికల స్టంటే

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 9: సార్వత్రిక ఎన్నికల కోసం సీఎం జగన్ టెట్, డీఎస్సీ పేరుతో యువతను బురిడీ కొట్టిస్తున్నారని హిందీసేవా సదన్ వ్యవస్థాపకుడు గైబువల్లి ఒక ప్రకటనలో మండిపడ్డారు. ఐదేళ్లల్లో ఒక్క డీఎస్సీ విడుదల చేయకుండా ఎన్నికల దృష్టిలో ఉంచుకొని నాటకాలు ఆడటం దుర్మార్గమన్నారు. కేవలం 6,100 పోస్టులు విడుదల చేసి అభ్యర్థులు చదివేందుకు సమయం ఇవ్వకుండా ఒకే సారి టెట్, డీఎస్సీలను విడుదల చేయడం ప్రపంచంలోనే ఎనిమిదో వింతగా ఉందన్నారు. ఇప్పటికైనా డీఎస్సీ పోస్టులు పెంచి... రీ నోటిఫికేషన్ జారీ చేయాలని, లేకపోతే రాబోవు ఎన్నికల్లో నిరుద్యోగ యువత ఓటుతో వైసీపీకి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

ఆర్టీసీ సిబ్బంది రక్తదానం

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 9: ఆర్టీసీ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం అనంతపురం రీజియన్‌లోని అన్ని డిపోల పరిధిల్లో రక్తదాన శిబిరాలు నిర్వహించారు. ఇందులో భాగంగా డాక్టర్ లక్ష్మణప్రసాద్ నేతృత్వంలో అనంతపురం బస్టాండు ఆవరణంలోని ఆస్పత్రిలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 73 మంది ఉద్యోగులు రక్తదానం చేశారు. అనంతరం ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆదోని.. వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఎం కార్యాలయ లా ఆఫీసర్ చంద్రశేఖర్, అనంతపురం డీఎం నాగభూపాల్, అసిస్టెంట్ డిపో మేనేజర్ వినయ్, బస్టాండు మేనేజర్ కేఎన్ మూర్తి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



రక్తదానం చేసిన సిబ్బందితో ఆర్ఎం

పాల ఉత్పత్తిదారులకు అవగాహన కల్పించండి

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 9: గ్రామాల్లో ఎంపీడీఓలు, వెటర్నరీ డాక్టర్, రూట్ ఇన్‌చార్జ్, పశుసంవర్ధక శాఖ సిబ్బంది, వెల్ఫేర్ అసిస్టెంట్ తదితరులు పాల ఉత్పత్తిదారులతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలని కలెక్టర్ గౌతమి సూచించారు. మండలంలోని రాచానపల్లి పరిధిలోని జగనన్న పాలవెల్లువ, మహిళా డెయిరీ సహకార సంఘాలను జేసీ కేతన్ గార్గ్, జిల్లా పరిషత్ సీఈఓ వైభోమ్ నిదియాదేవి తదితరులతో కలిసి కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఈనెల 13,14 తేదీల్లో జగనన్న పాలవెల్లువ కింద పాల సేకరణ చేపడతామని, అన్నిశాఖల అధికారులు సమన్వయం చేసుకుని పనులను పూర్తి చేయాలన్నారు. అమూల్‌కు పాలు పోయడం ద్వారా లీటర్‌కు రూ.ఐదు అదనంగా వచ్చే అవకాశం ఉంటుందని తెలియజేయాలన్నారు. బీఎంసీయూకి విద్యుత్ సరఫరా మూడు రోజుల్లో అందించాలన్నారు. పాల రవాణాకు అవసరమైన ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేష్, పశుసంవర్ధక శాఖ జేడీ సుబ్రహ్మణ్యం, విద్యుత్ శాఖ ఎస్ఈ సురేంద్ర, డెయిరీ మేనేజర్ నారాయణమ్మ, ఎంపీడీఓ పుల్లయ్య, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.



రాచానపల్లిలో డెయిరీని పరిశీలిస్తున్న కలెక్టర్, జేసీ

పీఎం కిసాన్ ఈకేవైసీ చేయించుకోండి

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 9: రైతులు పీఎం కిసాన్ ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని వ్యవశాయశాఖ ఏడీ రవి తెలిపారు. శుక్రవారం స్థానిక మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023-24రబీలో సాగుచేసిన పంటలను రైతులు నమోదు చేయించుకోవాలన్నారు. కంది పంట కొనుగోలు నేపథ్యంలో రైతులు ఆర్‌బీకేల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఉద్యానశాఖ అధికారి రత్నకుమార్ మాట్లాడుతూ.. ఫారంపాండ్స్ కావాల్సిన రైతులు తమ ఆర్‌బీకేల్లో పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఉద్యానశాఖ ద్వారా మినీ ట్రాక్టర్స్‌ను రూ.75వేల సబ్సిడీతో అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి సభ్యులు, ఏఈఓలు అలేఖ్య, మురళీకృష్ణ పాల్గొన్నారు.

తొలిరోజే 5,53,143 మందికి ఆల్బెండజోల్ మాత్రలు

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 9: అనంత జిల్లాలోని 1-19 మధ్య వయస్సున్న పిల్లలు 5,64,324 మంది ఉండగా.. తొలిరోజే 5,53,143 మందికి (98.02శాతం) నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు వేసినట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ.బీ. దేవి శుక్రవారం తెలిపారు. స్థానిక కేఎస్ఆర్ జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు మాత్రలు వేసి.. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆమె మాట్లాడారు. మిగిలిన పిల్లలను గుర్తించి వారికి కూడా ఈ మాత్రలు పంపిణీ చేస్తామన్నారు.

గార్లదిన్నె : మండలంలోని అన్ని అంగన్‌వాడీ, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశా లలోని విద్యార్థులకు శుక్రవారం అల్బెం డజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఇందులో వైద్యాధికారులు గౌతమి, మంజుల, ఎంఈఓలు తారా చంద్రానాయక్, వెంకటరమణ నాయక్, వైద్యులు దిలీప్, పద్మావతి, సీహెచ్ఓ లోకనాథ్ పాల్గొన్నారు.



విద్యార్థులకు మాత్రలు వేస్తున్న డీఎంహెచ్ఓ

టీడీపీతోనే అభివృద్ధి

ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్


కలగళ్ల గ్రామంలో కరపత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్

కూడేరు, ఫిబ్రవరి 9: తెలుగుదేశం పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ స్పష్టం చేశారు. శుక్రవారం కూడేరు మండలం కలగళ్ల, పి.నాగిరెడ్డిపల్లి, ఇప్పేరు గ్రామాల్లో బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో గ్రామాలు ఏమాత్రం అభివృద్ధి చెందలేదన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే గ్రామీణ, పట్టణ ప్రాంతాల అభివృద్ధికి శ్రీకారం చుడుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ ఘోరంగా ఓటమి పాలవుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, మాజీ ఎంపీపీ బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి పలువురి చేరిక

మండల పరిధిలోని పి. నాగిరెడ్డిపల్లి గ్రామంలో వైసీపీ నుంచి టీడీపీలోకి పలువురు చేరారు. ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ సమక్షంలో బోయ బాలరాజు, రాజాబి, కాసీంపీరా, అంకెరాము తదితరులు తెలుగుదేశంపార్టీలో చేరారు. పార్టీ విజయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే వారికి సూచించారు.

వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపండి

జేసీ అశ్మిత్‌రెడ్డి... వార్డుల్లో పర్యటన


సమస్యను అడిగి తెలుసుకుంటున్న జేసీ అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రి, ఫిబ్రవరి 9: వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జేసీ అశ్మిత్‌రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని 33, 34వార్డుల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ మిని మేనిఫెస్టో కరపత్రాలను అందించారు. వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలంటే టీడీపీకి ఓటు వేయాలన్నారు. టీడీపీ హయాంలోనే ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందని వివరించారు. ఆయన వెంట 30వవార్డు కౌన్సిలర్ విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

పెద్దపప్పూరు: మండలంలోని నరసాపురం గ్రామంలో శుక్రవారం టీడీపీ ఇన్‌చార్జి జేసీ అశ్మిత్‌రెడ్డి బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహించారు. ఇంటింటికి తిరిగి సమస్యలపై ఆరాతీశారు. టీడీపీ ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఆయన వెంట జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షుడు తాతిరెడ్డి లోకనాథరెడ్డి, భాస్కర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, కన్వీనర్ గుర్తి రఘునాయుడు, సత్యనారాయణరెడ్డి, మొలక నారాయణస్వామియాదవ్, అమర్‌నాథ్‌రెడ్డి, మండల క్లస్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, కార్యకర్తలు ఉన్నారు.

తొలిఓటు టీడీపీకి వేయండి

టీడీపీ నాయకుడు పెరుమాళ్ల జీవానందరెడ్డి


ఓటరు జాబితాను అందజేస్తున్న పెరుమాళ్ల జీవానందరెడ్డి

పామిడి, ఫిబ్రవరి 9: రాష్ట్రాభివృద్ధికి కృషి చేసే చంద్రబాబునాయుడుకు తొలిఓటు వేయాలని టీడీపీ నాయకులు పెరుమాళ్ల జీవానందరెడ్డి సూచించారు. మండలంలోని గజరాంపల్లి గ్రామంలో వ్యాలీ గ్రీన్ గార్మెంట్స్‌లో తొలి ఓటర్ల జాబితాలను నాయకులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రం అతలాకుతలమైందన్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోయిందన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు లేక కూలి పనులు చేస్తూ జీవించాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో తొలి ఓటర్లు వై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ అంటూ నినదిస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మున్నా, షేక్షా, శ్రీరాములు, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ఆవిష్కరణలపై సదస్సు


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ చంద్రమౌళి

తాడిపత్రి, ఫిబ్రవరి 9: స్థానిక సీవీఆర్‌టీ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం కొత్త ఆవిష్కరణలపై అవగాహన సదస్సు జరిగింది. శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ ఆధ్వర్యంలో ఆర్డీటీ సహకారంతో సృజన్ శిబిర్‌పై సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సదస్సును ప్రిన్సిపాల్ ఇందూదర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గొప్ప ఆలోచనలతో ముందుకు సాగినప్పుడే విజయం సాధిస్తారన్నారు. ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచి నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని కోరారు. అటల్ ఇంక్యుబేషన్ కేంద్ర మేనేజర్ డాక్టర్ చంద్రమౌళి విద్యార్థులకు ఇన్నోవేషన్‌పై అవగాహన కల్పించారు. పోటీ ప్రపంచంలో రాణించాలంటే వినూత్న ఆలోచనలను అందిపుచ్చుకోవాలని ఆయన సూచించారు. నూతన ఆకర్షణవైపు యువత ఆలోచించాలన్నారు. సదస్సులో మెంటర్లు జ్యోతి, తాహీన్ పాల్గొన్నారు.

టీడీపీకి పెరుగుతున్న ఆదరణ: కాలవ

రాయదుర్గం/రూరల్, ఫిబ్రవరి 9: నియోజకవర్గంలో తెలుగుదేశంపార్టీకి రోజురోజుకు ప్రజాదరణ పెరుగుతోందని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం ఉదయం ఆయన ఆయతపల్లి గ్రామం నుంచి 25 కుటుంబాలు, పట్టణంలోని 20వ వార్డులో కామయ్యతోటకు చెందిన 40 కుటుంబాల వారికి టీడీపీ కండువాలతో సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో అర్హులైన లబ్ధిదారులకు ఫించన్లు కూడా రావడం లేదన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ తమకు రావడం లేదని రైతులు ఆవేదన చెందారు. టీడీపీ హయాంలో ఇన్‌పుట్ సబ్సిడీ, పంట రుణాలు సక్రమంగా అందేవని గుర్తు చేశారు. కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో సాగుతున్న అరాచకాలను తట్టుకోలేని చాలామంది టీడీపీలోకి వస్తున్నారన్నారు. వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన 40 కుటుంబాలు పార్టీలోకి చేరడం సంతోషదాయకమన్నారు. రాష్ట్రంలో చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిని చేసుకోవడానికి అన్ని వర్గాల ప్రజలు ఉత్సాహంగా ఉన్నారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, కన్వీనర్ కురుబ హనుమంతు, మాజీ జడ్పీటీసీ విజయ్‌కుమార్, 20వ వార్డు ఇన్‌చార్జి పైతోట మధు, పైతోట రామాంజి, బీసీసెల్ అధ్యక్షుడు పూజారి తిప్పయ్య, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కడ్డిపుడి మహబూబ్‌బాషా, వేణు, వై వెంకటేశులు, బేకరి తిప్పేస్వామి, ఎస్సీ సెల్ మల్లి, యువత వాల్మీకి అశోక్, దాసరి సత్తి పాల్గొన్నారు.


కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కాలవ

భూములు కాజేయాలని చూస్తున్నాడు

సూరసింగనపల్లి రైతులు, మహిళలు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఆందోళన

గుత్తి, ఫిబ్రవరి 9: మున్సిపల్ పరిధిలోని చెట్నేపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తప్పుడు జనరల్ ఫోరం పట్టా సృష్టించి తమ విలువైన భూములను కాజేయడానికి సిద్ధమయ్యాడని సూరసింగనపల్లికి చెందిన రైతులు, మహిళలు స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ చెట్నేపల్లి గ్రామానికి చెందిన ఎల్లప్పగౌడ్ అనే వ్యక్తికి చెందిన పూర్వికుల భూములు ఉన్నాయంటూ తప్పుడు జీపీని సృష్టించారన్నారు. సర్వే నెంబర్ 212సీ, 215బీ, 216సీ1, 216డీ, 147, 148సీ, ధర్మాపురం గ్రామంలోని సర్వే నెంబర్ 151, 60లో దాదాపు 30 ఎకరాల రైతులకు చెందిన భూములను జీపీ ద్వారా పట్టా పాస్‌పుస్తకాలు తీసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తప్పుడు జీపీని సృష్టించిన వారిపై, డాక్యుమెంట్ రైటర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జీపీని రద్దు చేసేవరకు కదిలేదిలేదంటూ సబ్ రిజిస్ట్రార్ గురుప్రసాద్‌తో వాగ్వాదానికి దిగారు. పరిస్థితి విషమించడంతో పోలీసులు కార్యాలయానికి చేరుకొని వారికి నచ్చజెప్పడంతో తహసీల్దారు భారతికి వినతిపత్రం అందజేశారు. తప్పుడు జీపీ సృష్టించిన వారిపై చర్యలు తీసుకోవాలని సీఐ వెంకటరామిరెడ్డిని కోరారు. ఈ విషయంపై స్థానిక సబ్‌రిజిస్ట్రార్ గురుప్రసాద్‌ను వివరణ కోరగా తాము లింకు డాక్యుమెంట్ లేకుండా జీపీ చేసినది వాస్తవమేనని అన్నారు. వారు లింకు డాక్యుమెంట్ తెస్తామని చెప్పినందుకు పొరపాటును జీపీ చేశామన్నారు. నాలుగు రోజులు సమయం ఇస్తే విచారించి బాధితులకు న్యాయం చేస్తామని అన్నారు.


సబ్ రిజిస్ట్రార్‌తో వాగ్వాదానికి దిగిన రైతులు, మహిళలు

అంకెల గారడీ: ఉమామహేశ్వరనాయుడు

కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 9: అంకెల గారడీతో రాష్ట్ర ప్రజలను బురిడీ కొట్టించారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉమామహేశ్వరనాయుడు శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రవేశపెట్టిన బడ్జెట్ ఎన్నికల స్టంట్‌గా వుందన్నారు. వైసీపీ ప్రభుత్వం ఎన్నికల ప్రచారం కోసం బడ్జెట్ ప్రవేశపెట్టినట్లు స్పష్టంగా అర్థమవుతుందన్నారు. అభివృద్ధిపై మాట్లాడుతున్న వైసీపీ ప్రభుత్వం కనీసం రోడ్లు వేయలేని దుస్థితిలో వుండిపోయిందన్నారు. ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో అసలు జిల్లాకు ఎంత కేటాయించారో అన్నది స్పష్టత లేదన్నారు. హంద్రీనీవాతోపాటు హెచ్చెల్సీ కాలువలపై ప్రస్తావన అసలే లేదన్నారు. మరో వైపు రైతులకు ఏ మాత్రం ప్రయోజనం కలిగించే అంశం బడ్జెట్‌లో ఒక్కటీ లేదన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అప్పుల్లో కూరుకుపోయిందన్నారు. అన్ని వర్గాల ప్రజలను మభ్యపెడుతూ మరోసారి మోసానికి శ్రీకారం చుట్టేవిధంగా ఈ బడ్జెట్ ప్రవేశపెట్టారన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీని ప్రజలు బంగాళాఖాతంలో కలిపేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.

అన్ని వర్గాలనూ నిరాశపర్చింది: జితేంద్రగౌడ్

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 9: ఏపీ ఆర్థిక మంత్రి బుగ్గన్న ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడీ తప్ప ఏ మాత్రం ఉపయోగం లేదని టీడీపీ మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్ విమర్శించారు. ఆయన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏపీ బడ్జెట్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత రాష్ట్రం అప్పులాంధ్రప్రదేశ్‌గా మారిందన్నారు. పన్నుల బాదుడు తప్ప బడ్జెట్‌లో కొత్త అంశాలు ఏమీలేవన్నారు. అన్ని వర్గాలను నిరాశపరిచేవిధంగా బడ్జెట్ ఉందన్నారు. వైసీపీ హయాంలో తీసుకొచ్చిన ప్రతి స్కీమ్ స్కామ్‌గా మారిందన్నారు. సైకోరెడ్డిని గద్దె దింపటానికి ప్రజలు వేచి చూస్తున్నారన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే సంపద సృష్టించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపుతారన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు బీఎస్ కృష్ణారెడ్డి, కేశప్ప, రాయల్‌రామయ్య, తలారి మస్తానప్ప, జింకలజగన్నాథ్, రామన్నచౌదరి, కురుబశివన్న, పీకేసీ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



నేనున్నానన్న భరోసా కోసమే బస్సుయాత్ర

- జేసీపీఆర్



తాడిపత్రి, ఫిబ్రవరి 9: వైసీపీ నాయకుల దాడుల వల్ల భయభ్రాంతుల్లో ఉన్న పార్టీ శ్రేణులకు నేను ఉన్నానన్న భరోసా కల్పించేందుకే యువచైతన్య బస్సుయాత్రను చేపట్టానని టీడీపీ మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. పెద్దపప్పూరు మండలంలో నిర్వహించనున్న బస్సుయాత్రను దృష్టిలో ఉంచుకొని మండలానికి చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి స్థానిక నివాసంలో శుక్రవారం సమీక్ష జరిపారు. పెద్దవడుగూరు, యాడికి మండలాల్లో జరిగిన బస్సుయాత్ర ద్వారా పార్టీ శ్రేణులతోపాటు ప్రజలకు నేను ఉన్నాను అన్న భద్రతను కల్పించడం వల్లే విజయవంతమైందన్నారు. పెద్దఎత్తున పార్టీ శ్రేణులు, ప్రజలు స్వచ్ఛందంగా హాజరై అనేక సమస్యలను వైసీపీ నేతల నుంచి ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి ధైర్యంగా చెప్పుకువచ్చారన్నారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను అప్పటికప్పుడు పరిష్కరించామన్నారు. పెద్దపప్పూరు మండలంలో చేపట్టే బస్సుయాత్రలో కూడా ప్రజల అజెండాయే తన అజెండాగా ముందుకు సాగుతానన్నారు. ముందుగా పార్టీ శ్రేణులు గ్రామాల్లోకి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజల్లో తిరిగి వారి మద్దతు పొందినప్పుడే భవిష్యత్తు ఉంటుందన్నారు. బస్సుయాత్రకు ఎవరిని బలవంతంగా తీసుకురావద్దని స్వచ్ఛందంగా వచ్చిన వారితోనే కొనసాగిస్తామని తెలిపారు.

రాష్ట్రాభివృద్ధి టీడీపీతోనే సాధ్యం: ఉన్నం

బ్రహ్మసముద్రం, ఫిబ్రవరి 9: రాష్ట్రం అభివృద్ధి సాధించాలంటే ఒక్క టీడీపీతోనే సాధ్యమవుతుందని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉన్నం హనుమంతరాయచౌదరి స్పష్టం చేశారు. శుక్రవారం మండల పరిధిలోని వేపులపర్తి గ్రామంలో బాబుష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్లికార్జున, ఉన్నం వరలక్ష్మీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఉన్నం

గెలుపునకు సమష్టిగా కృషి చేద్దాం: టీడీపీ

బెళుగుప్ప: రాబోవు ఎన్నికల్లో టీడీపీ గెలుపునకు సమష్టిగా కృషి చేద్దామని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని విరుపాపల్లి గ్రామంలో కార్యకర్తల సమావేశాలను నిర్వహించి ఎన్నికలలో వైసీపీ కుటిల రాజకీయాలపై నిఘా వుంచుతూ సమన్వయంతో పని చేయాలని కార్యకర్తలకు సూచనలు, సలహాలిచ్చారు. సీనియర్ నాయకులు తగ్గుపర్తి రాధాకృష్ణ, పెద్దతిప్పయ్య, మల్లికార్జున, విరుపాపల్లి, రాధాకృష్ణ, సర్పంచ్ రాము, సురేష్, సునీల్, మచ్చప్ప, రామాంజినేయులు, వన్నూరుస్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 9: నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని సర్వేపల్లి రాధాకృష్ణ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రి పీపీ యూనిట్ అధికారి డాక్టర్ కల్యాణ్‌చక్రవర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. వైద్యులు మాట్లాడుతూ నులిపురుగుల నిర్మూలన కోసం ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలన్నారు. పరిశుభ్రమైన నీటినే తాగాలని, తినే ఆహారం కలుషితం కాకుండా మూతలు పెట్టాలన్నారు. సాధ్యమైనంత వరకు వేడిగా ఉన్న పదార్థాలే తీసుకోవాలన్నారు. ఇంటి చుట్టుపక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు కే స్వాతి, సాజీవ్, అరుణ, హరిత, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.


ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న వైద్యులు

'వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలి'

విడపనకల్లు, ఫిబ్రవరి 9: వేసవికాలంలో తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను క్వాలిటి కంట్రోల్ డీఈ పుష్పకుమార్ ఆదేశించారు. శుక్రవారం మండలంలోని సత్యసాయి మంచినీటి ట్యాంక్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం పని చేయని ఫిల్టర్ బెడ్లను పరిశీలించారు. శిథిలావస్థలో ఉన్నవాటికి మరమ్మతులు చేయించేందుకు ప్రభుత్వం ద్వారా ప్రత్యేక నిధులను కేటాయించి పనులు చేయించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ నస్రీన్‌బేగం, ఏఈఈ ధనుంజయ్య పాల్గొన్నారు.

విచారణ చేపట్టిన ఎస్‌ఐ

తాడిపత్రి, ఫిబ్రవరి 9: కల్లూరుకు చెందిన కొందరి వ్యక్తులకు పశువులను అప్పగించాలంటూ గుత్తి అనంతపురం, కాశేపల్లి గ్రామస్థులకు ఫోన్‌చేసి హుకుం జారీచేసిన కానిస్టేబుల్ ఎవరన్న దానిపై పెద్దవడుగూరు ఎస్‌ఐ శ్రీనివాసులు విచారణ చేపట్టారు. ఆంధ్రజ్యోతిలో శుక్రవారం వచ్చిన ఆ పశువులు మావే అన్న కథనంపై ఎస్పీ అన్బురాజన్ స్పందించారు. వెంటనే రెండు గ్రామాలకు చెందిన వారిని విచారణ జరిపి హుకుం జారీచేసిన కానిస్టేబుల్ వివరాలను అందించాలని ఎస్‌ఐను ఆదేశించారని సమాచారం.

వలంటీర్లపై చర్యలు తీసుకోండి: టీడీపీ కౌన్సిలర్లు

తాడిపత్రి, ఫిబ్రవరి 9: వైసీపీకి అనుకూలంగా పనిచేస్తూ ఓటరులిస్టు వెరిఫికేషన్ చేస్తున్న వలంటీర్లపై చర్యలు తీసుకోవాలంటూ శుక్రవారం కమిషనర్ రవికి టీడీపీ కౌన్సిలర్లు మల్లికార్జున, షెక్షావలి వినతిపత్రం ఇచ్చారు. మున్సిపాలిటీ పరిధిలో వార్డు వలంటీర్లు ఓటరు వెరిఫికేషన్ చేయకుండా ఆదేశాలు ఇవ్వాలన్నారు. భవిష్యత్తులో వార్డు వలంటీర్లు ఓటరులిస్టు వెరిఫికేషన్‌కు ప్రయత్నిస్తే ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువెళతామని తెలిపారు.

'ఓటరుజాబితా సవరణకు సహకరించాలి'

రాయదుర్గం, ఫిబ్రవరి 9: ఓటరుజాబితా సవరణకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ఈఆర్వో కరుణకుమారి సూచించారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమ్‌ఆద్మీ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటరమణబాబు బొమ్మనహాళ్ మండలంలోని ఓటరు జాబితాలో అనేక సమస్యలు ఉన్నట్లు ఈఆర్వో దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా టీడీపీ పట్టణ అధ్యక్షుడు పసుపులేటి రాజు అన్ని వార్డుల్లో జాబితాను సవరణ చేయాల్సివుందన్నారు. మున్సిపల్ కమిషనర్ హాజరు కాకపోవడంతో రాజకీయ పార్టీ నాయకులు సమావేశాన్ని బహిష్కరించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకుడు శివ, కాంగ్రెస్ పార్టీ నాయకులు జయన్న తదితరులు పాల్గొన్నారు.

'విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు'

రాయదుర్గం, ఫిబ్రవరి 9: ఎన్నికల విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని ఈఆర్వో కరుణకుమారి, కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులకు, పోలీసుశాఖ సిబ్బందికి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్, ఈడీటీ సుజాత, సెక్టార్ అధికారులు, డివిజన్‌స్థాయి అధికారులు, ఐదు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంఈఓలు తదితరులు పాల్గొన్నారు.

'అధికార పార్టీ అరాచకాలను ఎండగట్టండి'

రాయదుర్గం, ఫిబ్రవరి 9: అధికార పార్టీ చేస్తున్న అరాచకాలను ఎండగట్టాలని టీడీపీ మండల కన్వీనర్ హనుమంతు సూచించారు. శుక్రవారం మండలంలోని టీ వీరాపురం గ్రామంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ జెండా ఎగరేసేందుకు సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుయువత ప్రధాన కార్యదర్శి బట్టి తిప్పేస్వామి, క్లస్టర్ వాల్మీకి సిద్దప్ప, మాజీ ఎంపీటీసీ గంగాధర, మాజీ సర్పంచ్ సుంకన్న, గంగాధరశెట్టి, తిమ్మారెడ్డి, బీఎల్ ఓలు బీ తిప్పేస్వామి, టీ తిప్పేస్వామి, కార్యకర్తలు శ్రీనివాసులు, బొమ్మయ్య వెంకటేశులు, శ్రీకాంత్, ఎర్రిస్వామి, లింగప్ప పాల్గొన్నారు.

తండ్రి కొట్టడంతో కుమార్తె మృతి

యల్లనూరు, ఫిబ్రవరి 9: మండలంలోని పెద్దమల్లేపల్లి గ్రామంలో గురువారం రాత్రి వైష్ణవి (20)ని తండ్రి రామానుజన్‌రెడ్డి కొట్టడంతో మృతిచెందిందని సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. వైష్ణవి ఒక అబ్బాయితో కలిసి దిగిన ఫోటోలు ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టడంతో వైష్ణవి అక్క కుటుంబ సభ్యులకు తెలియజేసింది. దీన్ని జీర్ణించుకోలేని తండ్రి వైష్ణవిని కొట్టాడు. కిందపడిపోయిన వైష్ణవిని తాడిపత్రికి తీసుకువెళుతుండగా మార్గమధ్యలో మృతిచెందిందన్నారు. వైష్ణవి తల్లి సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

మహాలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు

డీ.హీరేహాళ్, ఫిబ్రవరి 9: ఓబుళాపురం గ్రామ సమీపంలో వెలసిన ఓబుళాపురం మహాలక్ష్మి ఆలయంలో శుక్రవారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం సుప్రభాత సేవతో పూజలను ఆలయ ప్రధాన అర్చకులు రఘుస్వామి ప్రారంభించారు. కుంకుమార్చన, బిల్వార్చన, సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం ఆలయంలో సర్వపాపదోష నివారణ కోసం గోపూజ నిర్వహించారు. భక్తులకు అన్నదానం కార్యక్రమం చేపట్టారు.

రథసప్తమి వేడుకలకు ఆహ్వానం

ఉరవకొండ, ఫిబ్రవరి 9: మండలంలోని బూదగవి గ్రామంలో సూర్య నారాయణస్వామి ఆలయంలో ఈ నెల 16న నిర్వహిస్తున్న రథసప్తమి వేడుకలకు రావాలని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌కు సూర్యనారాయణ సేవా సమితి సభ్యులు కోరారు. అనంతపురంలో శుక్రవారం ఎమ్మెల్యేను కలిసి ఈ మేరకు కరపత్రాన్ని అం దజేశారు. అదేవిధంగా ధర్మవరం మాజీ ఎమ్మెల్యే సూ ర్యనారాయణను కలిసి కరపత్రాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు చిరంజీవి, తిమ్మప్ప, ధనుంజయ, గోపాల్, అఖిల్, చక్రవర్తి, జయరామ్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉరవకొండ, ఫిబ్రవరి 9: పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఐదవ తరగతిలో ప్రవేశం కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సునీత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 23వతేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మూడు ఇసుక టిప్పర్ల సీజ్

యాడికి, ఫిబ్రవరి 9: అధికలోడుతో ఇసుక రవాణా చేస్తున్న మూడు టిప్పర్లను శుక్రవారం విజిలెన్స్ అధికారులు సీజ్‌చేశారు. కడపజిల్లా ఏటూరు రీచ్ నుంచి నేమకల్లుకు ఇసుక రవాణా జరుగుతున్నట్లు తెలిపారు. అధిక లోడుతో ఇసుక రవాణా జరుగుతున్నట్లు గుర్తించిన విజిలెన్స్ అధికారులు మూడు టిప్పర్లను సీజ్‌చేశారు. సీజ్‌చేసిన ఇసుక రవాణా టిప్పర్లను యాడికి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఆశ్రమానికి పశువుల అప్పగింత

పెద్దవడుగూరు, ఫిబ్రవరి 9: మండలంలోని కాశేపల్లి టోల్‌ప్లాజా వద్ద కంటైనర్ బోల్తాపడిన ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఆవులను శుక్రవారం ఎస్‌ఐ శ్రీనివాసులు మండలకేంద్రంలోని శ్రీ కాశిరెడ్డినాయన ఆశ్రమ నిర్వాహకులు బ్రహ్మానందరెడ్డికి అప్పగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మూగజీవాలను ఆదుకొనేందుకు తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తాడిపత్రి, ఫిబ్రవరి 9: పట్టణంలో ఉదయం 6:30గంటల నుంచి 10:30గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని అధికారులు తెలిపారు. ఈ అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

బీసీ హాస్టల్ కిటికీలు, గేట్ చోరీ

గుత్తి, ఫిబ్రవరి 9: పట్టణంలోని కర్నూలు రోడ్డులో నిరుపయోగంగా ఉన్న బాలికల బీసీ హాస్టల్ భవనాలకు ఉన్న వాకిళ్లు, ఇనుప గేట్లు, కిటికీలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. శుక్రవారం మధ్యాహ్నం కొందరు భవనంలో ఉన్న కిటికీలను పగలగొడుతుండగా సివిల్ సప్లై గోదాములో ఉన్న హమాలీలు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరు పారిపోయినట్లు సమాచారం. ఈ సంఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

'గుడిసెలను తొలగించడం అన్యాయం'

తాడిపత్రి, ఫిబ్రవరి 9: మండలం ఆలూరులోని సర్వేనెంబరు 618లో సీపీఐ ఆధ్వర్యంలో పేదలు వేసుకున్న గుడిసెలను అధికారపార్టీ నాయకులు తొలగించడం అమానుషమని సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రంగయ్య ఆగ్రహించారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇస్తామని మాయమాటలు చెప్పి మోసం చేసిందన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో వేసిన కొట్టాలను దౌర్జన్యంగా తొలగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి కేశవరెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజు పాల్గొన్నారు.

కళ్లలో కారంకొట్టి.. నగదు దోచేసి..

కళ్యాణదుర్గంరూరల్, ఫిబ్రవరి 9: పట్టణంలోని కుందుర్పి రోడ్డులోని కట్టెల డిపో నుంచి బయటకు వచ్చిన తన కళ్లల్లో కారంపొడి కొట్టి గుర్తు తెలియని దుండగులు రూ. 26 వేల నగదును దోచుకెళ్లినట్లు బాధితుడు ముస్తాఫా తెలిపాడు. ఈ ఘటన శుక్రవారం పట్టణంలో చోటు చేసుకోగా పట్టణ పోలీసులు సంఘటనపై బాధితుడితో ఆరా తీశారు.

13 ద్విచక్రవాహనాలు దగ్ధం

తాడిపత్రి, ఫిబ్రవరి 9: పట్టణంలోని బండామసీదు సమీపంలో గురువారం రాత్రి 13 ద్విచక్రవాహనాలు దగ్ధమైనట్లు పోలీసులు తెలిపారు. శివకు చెందిన మెకానిక్ షెడ్డు ముందర పాత ద్విచక్రవాహనాలతో పాటు రిపేరికి వచ్చిన రెండు ద్విచక్రవాహనాలు ఉంచడం జరిగిందన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతో దగ్ధమయ్యాయని తెలిపారు. సమాచారం అందిన వెంటనే వెళ్లి వివరాలు సేకరించామని పోలీసులు తెలిపారు.

అధికారులపై జడ్పీటీసీ ధ్వజం

- ఇసుక అక్రమ రవాణా చేస్తుంటే ఏం చేస్తున్నారంటూ ఆగ్రహం

యల్లనూరు, ఫిబ్రవరి 9: ఇసుక అక్రమ రవాణా జరుగుతుంటే ప్రతిపక్ష పార్టీ వారు వెళ్లి అడ్డుకొనే ప్రయత్నాలు చేస్తుంటే మండలంలోని అధికారులు ఏం చేస్తున్నారంటూ వైసీపీ జడ్పీటీసీ సభ్యుడు భోగాతి ప్రతాప్‌రెడ్డి అధికారులపై ధ్వజమెత్తారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటుచేశారు. గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు మంజూరైన పనులను చేపట్టడానికి ఇసుక కోసం అష్టకష్టాలు పడుతున్నారు. ఎక్కడైనా ట్రాక్టర్లు, ఎద్దుల బండ్ల ద్వారా ఇసుకను తీసుకువెళుతుంటే వారిని విచక్షణారహితంగా కొట్టి కేసులు నమోదు చేసే మీరు, ఎటువంటి పర్మిషన్లు లేకుండా రోజుకు వందలాది వాహనాల్లో ఇసుక తరలి వెళుతుంటే రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం ఉనట్లా లేనట్లా అని ప్రశ్నించారు.


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆర్టీసీ డిపోలో వైద్యశిబిరం

తాడిపత్రి, ఫిబ్రవరి 9: రోడ్డుభద్రతా మాసోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం ఆర్టీసీ బస్టాండ్‌లో సిబ్బందికి వైద్యపరీక్షలు నిర్వహించామని డిపో మేనేజర్ శంకర్ తెలిపారు. పట్టణంలోని జైస్వీ హాస్పిటల్ సహకారంతో వైద్యశిబిరం నిర్వహించామన్నారు. సిబ్బంది ఆరోగ్యంగా ఉండడం వల్ల కుటుంబంతోపాటు ప్రయాణికుల క్షేమాన్ని వారు చూడగలుగుతారన్నారు. ఎప్పటికప్పుడు వైద్యపరీక్షలు చేయించుకొని సంపూర్ణ ఆరోగ్యంతో సిబ్బంది ఉండాలని ఆయన కోరారు.

ప్రధానికి రాహుల్ క్షమాపణ చెప్పాలి: బీజేపీ

తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి 9: ప్రధాని నరేంద్రమోదీకి వ్యక్తిగత జీవితంపై చేసిన వ్యాఖ్యలకు రాహుల్‌గాంధీ క్షమాపణ చెప్పాలని బీజేపీ స్థానిక నాయకులు డిమాండ్ చేశారు. బీజేపీ శుక్రవారం పట్టణంలోని గాంధీసర్కిల్‌లో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పోతుల గంగాధర్‌యాదవ్, ఓబీసీ మోర్చా ఇన్‌చార్జ్ రామాంజనేయులు, అశోక్, సంజీవరాయుడు, నియోజకవర్గ కన్వీనర్ రంగనాథ్‌రెడ్డి, రంగనాయకులు, శేషఫణి పాల్గొన్నారు.

టీడీపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలి

కణేకల్లు, ఫిబ్రవరి 9: టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని టీడీపీ క్లస్టర్ కన్వీనర్ ఆనంద్‌రాజ్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జిలు, బీఎల్‌ఓలతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో కన్వీనర్ లాలెప్ప, క్లస్టర్ కన్వీనర్ మారుతి పాల్గొన్నారు.

పామిడి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఓటును ఒడిసిపట్టాలని తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడ్డి సూచించారు. పట్టణంలోని ఎద్దులపల్లి రోడ్డులోని తన స్వగృహం వద్ద యూనిట్ ఇన్‌చార్జిలతో శుక్రవారం ఆయన సమీక్షించారు. సమీక్షలో మాజీ కౌన్సిలర్ వైయూ రామాంజనేయులు, విభిన్నప్రతిభావంతుల జిల్లా అధ్యక్షుడు అప్పన్నగారి కుమార్, టీడీపీ పట్టణ అధ్యక్ష, ప్రధా న కార్యదర్శులు రామకృష్ణ, వడ్డే శివకుమార్, పట్టణ మాజీ అధ్యక్షుడు మోహన్‌కృష్ణ పాల్గొన్నారు.